ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
బుధవారం 19 జూన్ 2024


టమోటాలు రావడం భారీగా తగ్గిపోవడంతో వెలవెలబోతున్న ములకలచెరువు మార్కెట్

అధరహో...!

● టమోటా ధరలకు రెక్కలు ● ములకలచెరువులో కిలో రూ.72

ములకలచెరువు, జూన్ 18: టమోటా ధరలకు రెక్కలొచ్చాయి. ములకలచెరువు మార్కెట్ యార్డులో టమోటా ధరలు మరింత పెరిగి చుక్కలనంటాయి. ములకలచెరువు మార్కెట్‌లో మంగళవారం అత్యధికంగా 22 కేజీల బాక్సు నాణ్యతను బట్టి బాక్సు రూ.వెయ్యి నుంచి రూ.1600లు పలికింది. దీంతో కిలో టమోటా అత్యధికంగా రూ.72 పలికింది. వేసవిలో ఎండల తీవ్రత కారణంగా టమోటా సాగు భారీగా తగ్గడంతో ప్రస్తుతం దిగుబడి పడిపోయింది. దీంతో టమోటా ధరలకు ఒక్కసారిగా రెక్కలొచ్చాయి. ఇక్కడి నుంచి టమోటాలు తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాలతో పాటు మన రాష్ట్రంలోని పలు పట్టణాలు, నగరాలకు ఎగుమతి అవుతున్నాయి.

నాడు కళకళ... నేడు వెలవెల

టమోటాలతో కళకళలాడే మార్కెట్ ప్రస్తుతం వెలవెలబోతుంది. వేసవిలో టమోటా సాగుపై ఎండల తీవ్రత పడింది. మునుపెన్నడూ లేని విధంగా ఈసారి వేసవిలో 40 డిగ్రీలకు పైగా ఎండలు కాశాయి. దీంతో వ్యవసాయ బోర్లలో భారీగా భూగర్భజలాలు అడుగంటాయి. ఈ ప్రభావంతో టమోట సాగు భారీగా పడిపోయింది. దీనికితోడు దిగుబడి భారీగా తగ్గింది. తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ములకలచెరువు, తంబళ్లపల్లె, పెద్దమండ్యం, కురబలకోట, పెద్దతిప్పసముద్రం, బి.కొత్తకోట మండలాల్లో గతంలో ఎన్నడూ లేని విధంగా వేసవిలో టమో టా సాగు తగ్గింది. దీంతో ములకలచెరువు మార్కెట్‌కు టమోటాలు రావడం భారీగా తగ్గిపోయింది. సీజన్‌లో ఇక్కడి నుంచి 40 నుంచి 50 లారీల కాయలు బయటి రాష్ట్రాలకు ఎగుమతి అయ్యేవి. ప్రస్తుతం కేవలం 10 లారీలకు లోపు కాయలు మాత్రమే ఎగుమతి అవుతున్నాయి. టమోటాలు, టమోటాలు తీసుకొచ్చే వాహనాలు, రైతులతో కళకళలాడే మార్కెట్ నేడు వెలవెలబోతోంది. టమోటాల మండీలు కళ తప్పాయి.

దొంగల బెడదతో తోటల వద్ద కాపలా...

టమోటా ధరలు ఆకాశాన్నంటుతుండడంతో దొంగల బెడద ఎక్కువవుతోంది. దీంతో టమోటా తోటల వద్ద రాత్రి వేళల్లో రైతులు కాపలా కాస్తున్నారు. పలు చోట్ల తోటల్లో టమోటాలను గుర్తుతెలియని వ్యక్తులు కోసుకెళ్తుండడంతో రైతలు అందోళన చెందుతున్నారు. అలాగే టమోటా మార్కెట్‌లో కూడా గతంలో టమోటాలు దొంగతనం కావడంతో మండీ యజమానులు అప్రమత్తమయ్యారు. రాత్రి వేళల్లో మండీల్లో కాపలా ఉంచుతున్నారు.


టమోటా మండీలో వేలం నిర్వహిస్తున్న దృశ్యం

అనాథలా అన్నమయ్య ప్రాజెక్టు



అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోయి వందలాది కుటుంబాలకు శాపంగా మారితే.. ప్రాజెక్టులో పనిచేసే సిబ్బందికి మాత్రంగా వరంగా మారింది. ప్రాజెక్టు పునర్నిర్మిస్తుంటే వందల మంది సిబ్బంది క్షేత్రస్థాయిలో నివాసం ఉండి అక్కడే కార్యాలయాలను ఏర్పాటు చేసుకుని పనిచేయాల్సి ఉంది. కడపలో ఉంటూ.. ప్రాజెక్టు పని చేయకుండా రిజిస్టర్‌లో సంతకాలు చేస్తూ లక్షల్లో జీతాలు పొందుతున్నారు. అనాథలా ఉన్న అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోయి రెండున్నరేళ్లు అవుతున్నా అక్కడ ఒక్క పని కూడా జరగలేదు. సిబ్బంది మాత్రం నెలకు రూ.25 లక్షలు జీతం తగ్గకుండా ఏకంగా 30 మందికి యేడాదికి రూ.3 కోట్లు జీతాలు తీసుకుని కడపలో ఉండడంపై నూతన ప్రభుత్వం కన్నెర్ర చేస్తోంది.

పునర్నిర్మాణానికి నోచుకోని అన్నమయ్య ప్రాజెక్టు


● సిబ్బందికి మాత్రం ఏటా రూ.3కోట్ల జీతాలు
● పనులు జరగాల్సిన ప్రాజెక్టు ప్రాంతంలో ఉండకుండా కడపలోనే తిష్ట
● వైఎస్ జగన్ పాలన మార్కుతో కడపలోనే కొనసాగింపు
● శిథిలావస్థలో రాజంపేటలోని అన్నమయ్య ప్రాజెక్టు భవనాలు


రాజంపేటలో ఉండాల్సిన సబ్‌డివిజన్ కార్యాలయాన్ని కడపలో కొనసాగిస్తున్న ఓ అధికారి అనధికార కార్యాలయం

రాజంపేట, జూన్ 17: ఇరవై ఏళ్ల కిందట అన్నమయ్య ప్రాజెక్టును ప్రారంభించే నాటికి ప్రాజెక్టు ఉన్న ప్రాంతంలోనే సబ్‌డివిజన్ కార్యాలయాలు నాటి ఉమ్మడి కడప జిల్లా కేంద్రంలో ఈఈ కార్యాలయం, రాజంపేట హెడ్‌క్వార్టర్‌లో మరో సబ్‌డివిజన్ కార్యాలయం ఉండేది. ప్రాజెక్టు పూర్తయిన తర్వాత సిబ్బందికి పనిలేకుండా పోయింది. ప్రాజెక్టులు నిర్వహణ, కాలువల నిర్వహణ మాత్రమే ఉండేది. ప్రాజెక్టు పరిపాలన వ్యవహారాలనే చూసుకోవడానికి సిబ్బంది ఉండేవారు. అయితే 2021 సంవత్సరం నవంబరులో అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోయింది. ప్రాజెక్టు తెగిపోవడం స్థానిక అన్నదాతలకు, ప్రజలకు శాపంగా మారితే... ఇక్కడి సిబ్బందికి మాత్రం వరంగా మారింది. అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోయినప్పుడు ప్రాజెక్టు దిగువ ప్రాంతంలో ఉన్న సబ్‌డివిజన్ కార్యాలయాలు వరదలో కొట్టుకుపోయాయి. దీంతో ఇక్కడి సిబ్బందికి బాగా కలిసి వచ్చింది. రాజంపేట హెడ్‌క్వార్టర్‌లోని ఆర్అండ్‌బీ ప్రాంగణంలో ఒక సబ్‌డివిజన్ కార్యాలయం ఉండేది. ఆ కార్యాలయాన్ని కూడా మూసివేశారు. దీంతో అక్కడి సిబ్బంది కూడా కడపలో మకాం వేసి ఎంచక్కా తమ సొంత పనులు చూసుకోవడం ప్రారంభించారు. ఆర్అండ్‌బీ ప్రాంగణంలో అన్నమయ్య ప్రాజెక్టు గతంలో ఉన్న సబ్‌డివిజన్ కార్యాలయం భవనంతో పాటు తెలుగుగంగ ప్రాజెక్టు సబ్‌డివిజన్ కార్యాలయం భవనం కూడా ప్రస్తుతం ఖాళీగా ఉంది. ఈ రెండు కార్యాలయాల్లో సిబ్బంది లేకుండా పోవడంతో శిథిలావస్థకు చేరుకుని కళావిహీనంగా మారిపోయాయి. అతి తక్కువ ఖర్చుతో వీటికి మరమ్మతులు చేసుకుంటే సిబ్బంది అంతా ఇక్కడ ఉండవచ్చు. అయితే అది కాదని తెగిపోయిన ప్రాజెక్టు పేరిట పరిపాలన భవనం అయిన ఈఈ కార్యాలయంతో పాటు ఇక్కడ పనిచేసే సిబ్బంది మొత్తం కడపలోనే గత వైసీపీ పాలకుల కొమ్ముకాస్తూ అక్కడే కాలం గడపడం గమనార్హం.

అన్నమయ్య ప్రాజెక్టు ఉద్యోగుల వివరాలిలా..

అన్నమయ్య ప్రాజెక్టులో ఒక పరిపాలన అధికారి అయిన ఈఈ స్థాయి అధికారితో పాటు నాలుగు సబ్‌డివిజన్‌లు ఉన్నాయి. గతంలో ఉమ్మడి కడప జిల్లాలో అన్నమయ్య ప్రాజెక్టు ఉన్నందున పరిపాలన ఈఈ కార్యాలయం కడపలోని ఇరిగేషన్ కార్యాలయ ఆవరణలోనే అనేక ఏళ్లుగా ఉంది. అదేవిధంగా రాజంపేట ఆర్అండ్‌బీ ప్రాంగణంలో అన్నమయ్య ప్రాజెక్టు సబ్‌డివిజన్ 4వ కార్యాలయం ఓ డివిజనల్ స్థాయి అధికారితో ఉండేది. ప్రాజెక్టు ప్రాంగణంలో 2, 3 సబ్‌డివిజన్ కార్యాలయాలు ఉండేవి. కడపలోని ఈఈ కార్యాలయ ప్రాంగణంలో ఒకటో సబ్‌డివిజన్ కార్యాలయం కూడా ఉండేది. కడపలో పరిపాలన వ్యవహారాలు చూసే కార్యాలయం ఉండగా మిగిలిన మూడు సబ్‌డివిజన్ కార్యాలయాల సిబ్బంది ప్రాజెక్టు క్షేత్రస్థాయి పనుల్లో ఉండేవారు. ఒక్కో సబ్‌డివిజన్‌లో ఒక డీఈతో పాటు ఏఈలు, టెక్నికల్ సిబ్బంది, క్లర్కులు, అటెండర్లు ఉండేవారు. ఒక్కో ఆఫీసులో 5 మంది చొప్పున 4 సబ్‌డివిజన్ కార్యాలయాల్లో 20 మంది సిబ్బంది ఉన్నారు. ఇక ఈఈ కార్యాలయంలో 10 మంది సిబ్బంది ఉన్నారు. అంటే ఒక ఈఈతో పాటు నలుగురు డీఈలు, నలుగురు ఈఈలు సుమారు 12 మంది పైబడి ఏఈలు, ఇతర సిబ్బంది కలుపుకుని 30 మంది పైబడి సిబ్బంది ఇక్కడున్నారు. ఈఈ స్థాయి అధికారికి సుమారు రూ.2 లక్షలు, డీఈ స్థాయి అధికారికి ఒకటిన్నర లక్ష, ఏఈ స్థాయి అధికారికి సుమారు లక్ష రూపాయలు, కర్కులు, ఇతర సిబ్బందికి సుమారు 50 వేల నుంచి 80 వేల రూపాయలు జీతాలు అందుతున్నాయి. అంటే 30 మంది సిబ్బందికి నెలకు 25 లక్షల రూపాయలు జీతం తీసుకుంటున్నారు. అంటే ఏడాదికి రూ.3 కోట్ల జీతం ఈ అధికారులకు అందుతుంది.

వైసీపీ నాయకుల అండతో కడపలోనే మకాం

గత వైసీపీ పాలకుల అండతోనే ఈ తతంగమంతా జరుగుతోంది. కేవలం 22500 ఎకరాలు ఆయకట్టు కలిగిన 2.23 టీఎంసీల నీటి సామర్థ్యం కలిగిన ఈ మధ్యతరహా ప్రాజెక్టును కేవలం రూ.65 కోట్లతో పూర్తి చేస్తే.. జగన్ ప్రభుత్వ హయాంలో ఎస్టిమేట్‌లను రకరకాలుగా పెంచి ఏకంగా రూ.800 కోట్లు ఖర్చు కానున్నట్లు వెల్లడించారు. కాలువలు, గేట్లు, ఎర్త్‌డ్యాం పేరిట ఇలా ఎన్నో రకాల ఎస్టిమేట్‌లను తయారు చేయించి సుమారు రూ.760 కోట్లకు పైబడి నిధులకు టెండర్లు కూడా పిలిపించుకుని పనులు జరిగే సమయంలో కాంట్రాక్టర్ల వద్ద నుంచి కోట్లు దండుకోవడానికి ఈ సిబ్బందిని వైసీపీ పెద్దలు వీరిని పావుగా ఎన్నుకున్నారు. దీంతో ఈ సిబ్బందిని కడపలో ఉంచుకుని వారికి ఎటువంటి పనులు చెప్పకుండా ఇతర మండలాల్లో చెరువులు నిర్వహణ పేరిట నియామకాలు వేయించుకుని వీరిలో ప్రధాన అధికారుల నుంచి తప్పుడు ఎస్టిమేట్‌లు వేయించుకొని కోట్లు గడించడానికి వీరిని కడపలోనే ఉంచారు. ఒక ఎఇ స్థాయి అధికారి కడపలోని ఇతర ఇరిగేషన్ శాఖలను నిర్వర్తిస్తూ ఏకంగా అన్నమయ్య ప్రాజెక్టు ఎఇగా చేరి దొంకదారిలో సబ్‌డివిజన్ అధికారిగా చెలామణి అవుతూ వైసిపి పాలకులకు అనుచరునిగా మారి వారు చెప్పింది చేస్తూ అక్కడే మకాం వేశారు. తనకు తానుగానే రాజంపేటలో ఉండాల్సిన సబ్‌డివిజన్ కార్యాలయాన్ని కడపలోనే ఒక చిన్నపాటి కార్యాలయాన్ని ఏర్పాటు చేసి పనిలేని పనికి అక్కడే సిబ్బందిని ఏర్పాటు చేసుకుని తన సొంత పనులు చూసుకునేవారు. ఈ విషయాన్ని గమనించిన నూతన ప్రభుత్వం కన్నెర్ర చేయడంతో ఆ ఏఈని అన్నమయ్య ప్రాజెక్టు విధుల నుంచి తొలగించడంతో ఈ విషయం మొత్తం బట్టబయలైంది.

కొత్త జిల్లాలు ఏర్పడినా...

గత జగన్ ప్రభుత్వం కొత్త జిల్లాలను ఏర్పాటు చేసింది. అన్నమయ్య ప్రాజెక్టును అదే జిల్లాలోకి మారింది. అన్నమయ్య జిల్లా ఏర్పడి రాయచోటి జిల్లా కేంద్రమైనా అన్నమయ్య ప్రాజెక్టు కార్యాలయాన్ని మాత్రం మార్చలేదు. కారణం ప్రాజెక్టులో అనేక డిజైన్ల పేరిట కార్యాలయ భవనం అక్కడే ఉంది. ఈఈ కార్యాలయంతో పాటు 4 సబ్‌డివిజన్ కార్యాలయాల సిబ్బంది మొత్తం అక్కడే ఉంటున్నారు. కొత్త జిల్లాకు కార్యాలయం ఎందుకు మారలేదో అంతుబట్టని అంశం.

ప్రాజెక్టు పునర్నిర్మిస్తే సిబ్బంది ఎక్కడ ఉండాలి

అన్నమయ్య ప్రాజెక్టును పునర్నిరిర్మిస్తున్నామని ఇందుకు టెండర్లు కూడా పూర్తి చేశామని, ప్రాజెక్టు డిజైన్‌లు కూడా పూర్తయ్యాయని, వెంటనే పనులు జరుగుతున్నాయని స్వయం గా గత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అప్పట్లో ప్రకటించారు. మరి ప్రాజెక్టు పనులు ఇంత పెద్దఎత్తున ప్రారంభిస్తుంటే సిబ్బంది ఎక్కడ ఉండాలి. క్షేత్రస్థాయిలో ప్రాజెక్టు ఉన్న ప్రాంతంలో కచ్చితంగా ఉండి తీరాలి. ప్రస్తుతం ప్రాజెక్టు ఉన్న ప్రాంతంలో అతిథి గృహం పేరిట పెద్ద భవనం ఉంది. ప్రాజెక్టు సమీపంలో ఆకేపాడు ప్రాంతంలో బాడుగకు లభించే అనేక భవనాలు ఉన్నాయి. ఇక ప్రాజెక్టు సమీపంలోని రాజంపేట ప్రాంతంలో గతంలో సబ్‌డివిజన్ కార్యాలయ భవనాలకు చిన్న చిన్న మరమ్మతులు చేస్తే అక్కడే ఉండే సౌల భ్యం ఉంది. ఇవన్నీ కాదని వీరంతా కడపలోనే ఉండడం పెద్ద చర్చనీయాంశంగా మారిం ది. నూతన కూటమి ప్రభుత్వం పాలకులు ఈ విషయంపై దృష్టి సారించడంతో అన్నమయ్య ప్రాజెక్టు సిబ్బంది వ్యవహారం నేడు హాట్‌టాపిక్‌గా మారింది. ఈ విషయమై అన్నమయ్య ప్రాజెక్టు ఈఈ హరికిరణ్‌ను వివరణ కోసం ఆంధ్రజ్యోతి ప్రయత్నించగా ఆయన అందుబాటులో లేరు.

చంద్రబాబును కలిసిన బాలసుబ్రమణ్యం


సీఎం చంద్రబాబును కలిసి శుభాకాంక్షలు తెలిపిన రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ సుగవాసి బాలసుబ్రమణ్యం

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును రాజంపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ సుగవాసి బాలసుబ్రమణ్యం మంగళవారం కలిశారు. సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ అద్భుత విజయం సాధించినందుకు చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నికల్లో రాజంపేట నియోజకవర్గంలో పార్టీ ఓటమికి గల కారణాలపై పూర్తి స్థాయిలో చర్చించి.. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సీఎం సూచించినట్లు బాలసుబ్రమణ్యం తెలిపారు. పార్టీ మీ వెంట ఉంటుందని చంద్రబాబు భరోసా ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు.

ఆదాయం పెంచుతారో... పంచుకుంటారో!


పీలేరు గ్రామ పంచాయతీ కార్యాలయం

● నేడు పీలేరు పంచాయతీ వనరుల బహిరంగ వేలం
● సిండి'కేటు'గాళ్లతో తగ్గిపోతున్న ఆదాయం
● నిస్సహాయంగా మిగిలిపోతున్న అధికారులు

పీలేరు, జూన్ 18: ఆదాయ వనరుల నిర్వహణ కోసం ప్రతి ఏటా పీలేరు గ్రామ పంచాయతీ అధికారులు నిర్వహిస్తున్న బహిరంగ వేలం పాటలు అపహాస్యం పాలవుతున్నాయి. బహిరంగ వేలంపాటల్లో పాల్గొనే కాంట్రాక్టర్లు సిండికేటుగా ఏర్పడి పంచాయతీ ఆదాయానికి గండికొడుతున్నారు. సిండికేటు వ్యవహారం తమ కళ్ల ముందే జరుగుతున్నా అధికారులు ఏమీ చేయలేక నిస్సహాయంగా మిగిలి పోతున్నారు. ఈ క్రమంలో పీలేరు గ్రామ పంచాయతీలో ఆదాయ వనరుల నిర్వహణకు బుధవారం జరగనున్న వేలం పాటలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ప్రతి ఏడాదిలాగే ఈసారి కూడా వేలం పాటల్లో పాల్గొనే వారు సిండికేటుగా ఏర్పడి ఆదాయాన్ని తమలో తాము పంచుకుంటారో లేక పోటీపడి పంచాయతీకి ఆదాయం పెంచుతారోనన్న అంశంపై స్థానికులు ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. పంచాయతీ పరిధిలోని దినసరి కూరగాయల మార్కెట్, ప్రైవేటు బస్టాండు, జంతు వధశాల కోసం బుధవారం బహిరంగ వేలం జరగనుంది. మంగళవారం జరిగే వారపుసంత, పంచాయతీ షాపింగ్ కాంప్లెక్స్ గదుల వేలాన్ని తాత్కాలికంగా వాయిదా వేశారు.

సిండికేటుగాళ్లతో ఆదాయానికి గండి

పీలేరు పంచాయతీ పరిధిలో ఆదాయ వనరుల కోసం వేలం జరిగిన ప్రతిసారీ పదుల సంఖ్యలో కాంట్రాక్టర్లు పోటీపడేందుకు పంచాయతీ కార్యాలయంలో దరావత్తులు చెల్లిస్తారు. తీరా వేలంపాటలు ప్రారంభమయ్యే సమయానికి సిండికేటుగా ఏర్పడి పంచాయతీ ఆదాయానికి గండికొడుతుంటారు. సిండికేటు వ్యవహారం పంచాయతీ కార్యాలయ ఆవరణలో తమ కళ్ల ముందే జరుగుతున్నా అటు అధికారులుగానీ, ఇటు పాలకవర్గం గానీ ఏమీ చేయలేని నిస్సహాయస్థితిలో మిగిలిపోతున్నారు. ఎంత మంది నిజాయితీగా వేలంపాటలో పాల్గొంటారో, సిండికేటు కోసం ఎంత మంది వస్తారో తమకు తెలుసునని, అయినా నిబంధనల మేరకు తాము ఏమీ చేయలేకున్నామని కొందరు పంచాయతీ అధి కా రులు గతంలో వాపోయారు. కేవలం ఒక్క మంగళవారం వారపు సంత వేలం పాటలోనే సిండికేటుగాళ్లకు దాదాపు రూ.5 లక్షల నుంచి రూ.8 లక్షల దాకా ముడుతుందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఆ తరువాత స్థానం ప్రైవేటు బస్టాండు, జంతు వధశాల వేలం పాటలది. వీటిని దక్కించుకోవడానికి కూడా దాదాపు రూ.2లక్షల నుంచి రూ.3లక్షల దాకా చేతులు మారాల్సిందేనన్నది బహిరంగ రహస్యం.

అయితే గత ఏడాది మంగళవారం వారపుసంత, దినసరి కూరగాయల మార్కెట్‌ను ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి సూచనల మేరకు ఆయన పీఏ ఉదయ్‌కుమార్ తన తల్లి పేరిట పాడుకున్నారు. అది కూడా ఎంపీ పేరు చెప్పి పెద్దగా పోటీ లేకుండా చేసుకోగలిగారు. ఈ ఏడాది వారపు సంత వేలాన్ని తాత్కాలికంగా వాయిదా వేయగా.. దినసరి కూరగాయల మార్కెట్‌ను మాత్రం బుధవారం వేలం వేయనున్నారు.

గత ఏడాది వేలం వివరాలు

గత ఏడాది మార్చి 28వ తేదీ పంచాయతీ ఆదాయ వనరుల నిర్వహణ వేలం పాటలు జరిగాయి. ఆరోజు దినసరి కూరగాయల మార్కెట్ రూ.2,36,000లు, జంతువధశాల రూ.4.31 లక్షలు, ప్రైవేటు బస్టాండు రూ.5.37 లక్షలు పలికాయి. బుధవారం జరిగే వేలం పాటల్లో ఇవి ఏ మేరకు పెరుగుతాయో వేచి చూడాలి.

ప్రభుత్వ శాఖల్లో సేవలను విస్తృతం చేయాలి


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ అభిషేక్‌కిశోర్

● పెండింగ్ అంశాలపై దృష్టి పెట్టాలి
● ప్రజా ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి
● కలెక్టర్ అభిషిక్త్ కిశోర్

రాయచోటి(కలెక్టరేట్), జూన్ 18: ప్రభుత్వ శాఖల్లో ప్రజలకు అందించే రోజు వారి సేవలను విస్తృతం చేయాలని కలెక్టర్ అభిషిక్త్‌కిశోర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం రాయచోటి మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లతో గ్రామ, వార్డు సచివాలయ సేవలు, ఈ-సర్వీసెస్ పెండింగ్ పేమెంట్స్, ఎన్ఆర్ఈజీఎస్, తాగునీరు, జల్‌జీవన్ మిషన్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ, రెవెన్యూ సర్వీసులు, భూసేకరణ, సివిల్ సప్లై తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించి.. తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అందరూ కష్టపడి పనిచేసి సాధారణ ఎన్నికల ప్రక్రియను విజయవంతం చేశారని అభినందించారు. ఎన్నికలకు సంబంధించి నియోజకవర్గాల్లో ఇంకా ఎక్కడైనా టీఏ, డీఏ, ఇతర పనులకు సంబంధించిన చెల్లింపులు పెండింగ్‌లో ఉంటే వెంటనే చెల్లించాలని సూచించారు. ఇందుకు అవసరమైన నిధులను ఇప్పటికే మంజూరు చేశామని తెలిపారు. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి ఐదు ఫైల్స్‌పై ప్రాధాన్యంగా సంత కాలు చేశారని.. సూపర్‌సిక్స్ పథకాలను ప్రకటించారని.. వీటన్నింటిపై అందరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ముఖ్యంగా జిల్లాలో గతంలో ఎక్కడైతే అన్నా క్యాంటీన్లు ఉన్నాయో వాటి పరిస్థితిపై ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్లు క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదిక సిద్ధం చేసి.. వంద రోజుల లోపల పనులు చేపట్టాలని సూచించారు. ఉపాధి హామీలో ఉద్యానవన పనులకు సంబంధించి నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలన్నారు. జిల్లాలో వర్షాలు కురుస్తున్నందున హార్టికల్చర్ ప్లాంటేషన్స్‌కు మండలస్థాయిలో తీర్మానాలు చేసి పనులకు సంబంధించి మంజూరు ఉత్తర్వులు పొందాలన్నారు. జిల్లాలో గ్రామీణ నీటి సరఫరాశాఖ ద్వారా జలజీవన్‌మిషన్ కింద గుర్తించిన పనులను వెంటనే ప్రారంభించాలన్నారు. స్పందన కార్యక్రమాన్ని ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థగా మార్చినందున ఆన్‌లైన్ పోర్టల్‌లో ఇప్పటికే నమోదైన ప్రజా సమస్యల దరఖాస్తులను పరిశీలించి పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. రెవెన్యూ అంశాలకు సంబంధించి క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించి పారదర్శకంగా ఎలాంటి ఫిర్యాదులు, అభియోగాలు లేకుండా పరిష్కరించాలని తహసీల్దార్లు, ఆర్డీవోలకు సూచించారు. వెబ్‌ల్యాండ్‌లో ల్యాండ్ కన్వర్షేషన్ అంశాలపై దృష్టి పెట్టాలని, వివిధ అభివృద్ధి పథకాలకు సంబంధించి ఇప్పటివరకు సాధించిన ప్రగతి, సాధించాల్సిన లక్ష్యం, కోర్టు కేసుల పెండింగ్ తదితర వాటిపై క్షుణ్ణంగా అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. నూతన ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల మేరకు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా నిత్యావసర వస్తువుల పంపిణీ చేయడం జరుగుతుందని.. దీనిపై ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం వివిధ అంశాల్లో పలు సూచనలు జారీ చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్‌వో సత్యనారాయణరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో అరటి రైతు మృతి



రైల్వేకోడూరు, జూన్ 18: బొజ్జావారిపల్లె అరటి తోటకు నీరు పారగట్టేందుకు పొలానికి వెళ్లిన బుర్రా జనార్ధన్ (47)కాలికి విద్యుత్ తీగ కాలికి అక్కడికి అక్కడే మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. రైతు జనార్ధన్‌కు మూడెకరాల వ్యవసాయ భూమి ఉంది. అందులో అరటి తోట వేశాడు. తోటకు నీరు పారగట్టేందుకు తన పొలంలో వెళుతుండగా విద్యుత్ తీగ కాలికి తగిలి అక్కడికి అక్కడే కుప్పకూలాడు. కాగా జనార్ధన్ తల్లి జానకమ్మ కుమారుడికి భోజనం తీసుకుని పొలం దగ్గరకు వెళ్లింది. అక్కడ పడి ఉన్న జనార్ధన్‌ను చూసి కేకలు పెట్టింది. పక్కనే ఉన్న రైతులు, స్థానికులు వచ్చారు. రైతును తీసుకుని రైల్వేకోడూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే జనార్ధన్ చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య సంపూర్ణమ్మ, కుమారుడు రవి, కుమార్తె రవిత్రి ఉన్నారు. శవ పరీక్షల కోసం కోడూరు ఆస్పత్రిలో ఉంచారు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. విద్యుత్ ప్రమాదం ఎలా జరిగిందని విద్యుత్ అధికారులు ఆరా తీశారు. జనార్ధన్ మృతితో బొజ్జావారిపల్లె గ్రామం శోకసంద్రంలో మునిగిపోయింది. కుటుంబ సభ్యులు మాకు ఎవరు దిక్కు అని విలపించారు.

లారీ, బైకు ఢీ - ఒకరు మృతి


రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన రమణయ్య

రాజంపేట టౌన్, జూన్ 18: ఊటుకూరు అశోక్‌గార్డెన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో రమణయ్య (45) మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే పుల్లంపేట మండలం బావికాడపల్లె రైతు రమణయ్య, మణి ఇద్దరూ పనుల నిమిత్తం పుల్లంపేట నుంచి రాజంపేటకు వస్తుండగా రాజంపేట శివారు ప్రాంతం అశోక్‌గార్డెన్ వద్ద ఎదురుగా వస్తున్న లారీని ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనం నుజ్జు నుజ్జు కాగా రమణయ్య తీవ్రంగా గాయపడడంతో అక్కడికక్కడే మృతి చెందారు. రమణయ్య మృతదేహాన్ని రాజంపేట ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. గాయపడిన మణిని మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. రాజంపేట రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రాజంపేట రూరల్ సీఐ రవీంద్రనాథ్ తెలిపారు.

కాశినాయన గుడివద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి



సిద్దవటం, జూన్ 18: కడప - చెన్నై జాతీయ రహదారి పెద్దపల్లె పంచాయతీ శివునిపల్లె సమీప కాశినాయన గుడివద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు పంచాయతీ కార్యదర్శి ప్రసాద్‌రెడ్డికి సమాచారం ఇవ్వడంతో పంచాయతీ కార్యదర్శి గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందిన విషయాన్ని పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు విచారిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి తెలిపారు.

వేంపల్లెలో యువకుల బాహాబాహీ

పోలీస్‌స్టేషన్‌కు తరలింపు ● భయాందోళనల్లో ప్రజలు


వేంపల్లె బజారులో గుమిగూడిన జనం

వేంపల్లె, జూన్ 18: స్థానిక మెయిన్ బజార్‌లో రెండు వర్గాల యువకులు బాహాబాహీకి దిగారు. ఒకరిపై ఒకరు పిడిగుద్దులు గుద్దుకున్నారు. క్రికెట్ ఆటపై జరిగిన వాదోపవాదాలు పెరిగి మెయిన్ బజార్‌లో కొట్టుకునే స్థాయికి వచ్చింది. రెండువర్గాలు తలపడడంతో భయానక వాతావరణం కనిపించింది. స్థానికులు విడిపించిన మళ్లీ కొద్దిసేపటికి బజారులో గుంపులుగా రావడంతో అప్పటికే సమాచారం అందుకున్న పోలీసులు బజారులోకి చేరుకుని మందలించారు. ఇరువర్గాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. చిన్నచిన్న విషయాలకు గొడవలు చేసుకుంటూ బ్యాచ్‌లుగా యువకులు సంచరిస్తుండడంతో సానికుల్లో భయాందోళన నెలకొంది. పోలీసులు అంటే భయం లేకుండా బాహాటంగా తిరుగుతున్నారనే విమర్శలున్నాయి. ఇలాంటి బ్యాచ్‌లను అదుపు చేయకుంటే భవిష్యత్తులో మరిన్ని ఘర్షణలు చూడాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మందుబాబుల వీరంగం - ఒకరికి గాయాలు

బద్వేలుటౌన్, జూన్ 18: మైదుకూరు రోడ్డులోని ఎన్ఎంఎస్ కల్యాణ మండ పం వద్ద మందుబాబులు వీరంగం సృష్టించి సీసాలతో దాడి చేసుకోవడం తో సురేంద్రనగర్ వాసి రామచంద్రకు గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే... ఇద్దరు యువకులు ఎన్ఎంఎస్ కల్యా ణ మండపం సమీప వెంచర్‌లో మ ద్యం తాగుతుండగా మరో ముగ్గురు యువకులు ద్విచక్రవాహనంలో వచ్చి దుర్భాష లాడారు. దీంతో మాటా మాటా పెరిగి బీరు సీసాలతో దాడిచేయడంతో ముగ్గురు యు వకులు ఒక్కసారిగా రామచంద్రపై దాడి చేయడంతో తలకు బలమైన గాయమైంది. చుట్టుపక్కల యువకులు చికిత్స నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై రామచంద్ర ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రైస్‌మిల్లుపై ఆకస్మిక తనిఖీ


బియ్యం బస్తాలను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

కడప (క్రైం)/ముద్దనూరు, జూన్ 18: కడప విజిలెన్స్ అధికారులు రైస్‌మిల్లును ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. కడప రీజనల్ విజిలెన్స్, పౌరసరఫరాలశాఖ, తూనికలు, కొలతలు, అగ్రికల్చర్ మార్కెటింగ్ అధికారులు సంయుక్తంగా ముద్దనూరు మండలం, తాడిపత్రి రోడ్డులోని శ్రీగురు ఆంజనేయ రైస్‌మిల్లును ఆకస్మికంగా తనిఖీ చేశారు. మిల్లులోని బియ్యం, వడ్లు భౌతిక నిల్వలు, రికార్డులను పరిశీలించారు. వేయింగ్ మెషిన్ స్టాంపింగ్ లేనందుకు తూనికలు కొలతలశాఖ చట్టం ప్రకారం రూ.25వేలు అపరాధ రుసుం విధించారు. రికార్డులు సక్రమంగా లేనందు వల్ల జీఎస్టీ యాక్ట్ 2017 ప్రకారం రూ.50వేలు అపరాధ రుసుం విధించినట్లు వారు తెలిపారు. కడప రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారి షేక్‌మాసుం బాష ఆదేశాలపై దాడులు నిర్వహించామన్నారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు రెడ్డప్ప, బాల గంగాధర్‌రెడ్డి, అగ్రికల్చర్ అధికారులు శ్రీనివాసులు, అసిస్టెంట్ జియాలజిస్ట్ మురళీక్రిష్ణ, ఖాజాహుసేన్, గీతావాణి, బాబుమోసెస్, అర్జున్‌రావు, తారకనాధరెడ్డి పాల్గొన్నారు.

భాష్యం పాఠశాలలో పాఠ్యపుస్తకాలు సీజ్


పుస్తకాలను పరిశీలిస్తున్న ఎంఈఓ

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 18: నిబంధనలకు విరుద్ధంగా భాష్యం పాఠశాలలో పుస్తకాలు విక్రయిస్తుండడంతో ఎంఈఓ సావిత్రమ్మ పాఠ్యపుస్తకాలను సీజ్ చేశారు. ఆర్ఎస్‌యూ (రాయలసీమ స్టూడెంట్ యూనియన్) రాష్ట్ర అధ్యక్షుడు జగన్ ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు, విద్యాసామగ్రి విక్రయిస్తున్నారని చర్యలు తీసుకోవాలని డీఈఓ అనూరాధకు ఫిర్యాదు చేశారు. డీఈఓ ఆదేశాల మేరకు ఎంఈఓ సావిత్రమ్మ మంగళవారం పాఠశాలను తనిఖీ చేశారు. గదిలో ఉన్న పాఠ్యపుస్తకాలను పరిశీలించి పాఠశాలలో విక్రయించరాదని నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠ్యపుస్తకాలు ఉన్న గదిని సీజ్ చేశారు. ఎంఈఓ మాట్లాడుతూ పాఠశాలలో పుస్తకాలు విక్రయించడంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళుతామని వారు తగిన చర్యలు తీసుకుంటారన్నారు.

నిబంధనలు పాటించాలి : డిప్యూటీ డీఈఓ


రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈఓ

సింహాద్రిపురం, జూన్ 18: ప్రైవేట్ పాఠశాలల్లో ప్రభుత్వ నిబంధనలు తప్పక పాటించాలని డిప్యూటీ డీఈఓ కృష్ణప్ప సూచించారు. మంగళవారం సింహాద్రిపురంలోని పలు ప్రైవేట్ పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదిలో గాలి, వెలుతురు, టాయిలెట్లు, క్రీడా మైదానం తప్పనిసరిగా ఉండాలన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన మేరకే ఫీజులు వసూలు చేయాలన్నారు. అధిక ఫీజులు వసూలు చేస్తే పాఠశాలను సీజ్ చేస్తామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

బలవంతంగా సంతకం చేయించారు

కౌన్సిలర్ల తర్వాతే నేను చేశాను : చైర్‌పర్సన్ శివమ్మ ● లబ్ధిదారులకు టిడ్కో గృహాలు ఇవ్వాలి ● నగర పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తాం : ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి


కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, చైర్‌పర్సన్ శివమ్మ

జమ్మలమడుగు, జూన్ 18: నగర పంచాయతీ పరిధి కూరగాయల మార్కెట్ టెండర్లు రద్దు చేసినా అప్పటి ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి కౌన్సిలర్లతో బలవంతంగా సంతకాలు చేయించి చివరగా నాతో సంతకం చేయించారని మున్సిపల్ చైర్‌పర్సన్ శివమ్మ తెలిపారు. మంగళవారం ఉదయం 11 గంటలకు నగర పంచాయతీ అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. అయితే ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి ఆలస్యంగా రావడంతో మధ్యాహ్నం 12.30 గంటల నుంచి నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో 4వ వార్డు కౌన్సిలర్ జ్ఞాన ప్రసూన మృతి పట్ల ఆమె ఆత్మ శాంతికి రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం కౌన్సిల్ సమావేశంలో తొమ్మిది అంశాలతో కూడిన అజెండాను ఒక ఉద్యోగి చదివి వినిపించారు. అందులో 9వ అంశంపై మున్సిపాలిటీలో పారిశుధ్య కార్మికులు ఎంత మంది ఉన్నారు, బడ్జెట్ ఎంత ఉందని కమిషనర్ ప్రమోద్‌కుమార్‌ను ఎమ్మెల్యే అడిగారు. మూడేళ్ల నుంచీ నగర పంచాయతీలో అభివృద్ధి చేయలేని వారు అక్రమాలకు పాల్పడ్డారని ఎమ్మెల్యే అన్నారు. 12 నెలలకు పారిశుధ్య కార్మికులకు మూడు కోట్ల రూపాయలు జీతాల కింత ఖర్చయితే మున్సిపాలిటీ ఎలా అభివృద్ధి అవుతుందని ఎమ్మెల్యే ప్రశ్నించారు. పారిశుధ్య కార్మికుల జీతాలను జనరల్ ఫండ్‌లో కాకుండా ప్రభుత్వం డబ్బు జీతాలకు ఇచ్చేలాగున వైసీపీలో చేసిన జీఓను రద్దు చేస్తామన్నారు. అప్పుడే అభివృద్ధి కోసం నిధులు మున్సిపాలిటీకి ఉపయోగపడతాయన్నారు. వైస్‌చైర్మన్-2 సింగరయ్య మాట్లాడుతూ గతంలో ఎప్పుడూ ఇలాంటి మీటింగ్ జరగలేదని, అప్పుడు అడగకుండా ఇప్పుడు సంతకాలు, మార్కెట్ టెండర్లపై అంతా అడుగుతున్నారన్నారు. వెంటనే కౌన్సిలర్లు ముల్లాజానీ, మునిసుబ్బారెడ్డి మాట్లాడుతూ మూడు నెలలకు ఒకసారి అభివృద్ధి సమావేశం నిర్వహించాలన్నా పెట్టడం లేదన్నారు. వైసీపీ ప్రభుత్వంలో కౌన్సిలర్లకు ఎలాంటి గౌరవం లేకుండా పోయిందని, కౌన్సిలర్లను పిలవడం లేదన్నారు. మార్కెట్ టెండర్లను కౌన్సిల్ సమావేశంలో తిరస్కరిస్తే ఒత్తిడి చేసి అవే టెండర్లను తిరిగి కౌన్సిలర్లతో సంతకాలు చేయించుకుని ఏర్పాటు చేశారన్నారు. కౌన్సిల్ సమావేశంలో ప్రజా సమస్యలు అడగకుండా అప్పటి ఎమ్మెల్యే, అధికారులు పనిచేశారని, టీ, కాఫీలు ఇవ్వడమే తప్ప అభివృద్ధిపై అడిగేందుకు కూడా సమయం ఇచ్చేవారు కాదన్నారు. కౌన్సిలర్ బాణా శివరామలింగారెడ్డి మాట్లాడుతూ టిడ్కో గృహాలు వెంటనే లబ్ధిదారులకు ఇవ్వాలని కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నగర పంచాయతీలో మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పీఏ అమర్‌నాథ్ రెడ్డి పేరుతో ప్రతి పనిలో అజెండాలో పేరు చేర్చుకుని ఎలాంటి పని చేయకపోయినా బిల్లులు తీసుకున్నట్లు ఆరోపణలున్నాయన్నారు. జమ్మలమడుగు నగర పంచాయతీ పరిధిలో జరిగిన అవినీతి అక్రమాలపై అధికారులు నివేదిక తయారు చేయాలని, అసెంబ్లీ తర్వాత వీధి వీధీ తిరిగి కఠిన చర్యలు తీసుకుంటామని, అవినీతి అక్రమాలపై తాట తీస్తామన్నారు. ఎవరు తప్పు చేసినా వదిలే ప్రసక్తే లేదన్నారు. మున్సిపాలిటీ స్థలాలు ఆక్రమణ జరిగాయని, వాటిని సంబంధిత అధికారులు వెంటనే పరిశీలించాలన్నారు. జగనన్న కాలనీల్లో మున్సిపాలిటీ పరిధిలో ఎక్కడా నీటి సమస్యలు కరెంటు, విద్యుత్తు వీధి దీపాల సమస్యలు ఉండరాదన్నారు. పారిశుధ్యం, డ్రైనేజీ శుభ్రంగా ఉండేందుకు చర్యలు తీసుకోవాలని కమిషనర్, సిబ్బందికి ఎమ్మెల్యే హెచ్చరించారు. సీజ్ చేసిన వాటర్‌ప్లాంట్ల సమస్యలు త్వరగా పరిష్కరించాలని, కరెంటు బిల్లుల పెండింగ్ అధికారులతో మాట్లాడి సంబంధిత యజమానులతో కట్టించాలని కమిషనర్‌ను, విద్యుత్తు, హౌసింగ్ సిబ్బందిని ఎమ్మెల్యే హెచ్చరించారు. అనంతరం జమ్మలమడుగు పరిసర ప్రాంతాల్లోని విద్యాశాఖ తదితర శాఖల సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

'ఇసుక దోపిడీని అడ్డుకుంటాం'

జమ్మలమడుగులో ఇసుక అక్రమ రవాణాను అడ్డుకుని నీటి సమస్య లేకుండా గట్టి చర్యలు తీసుకుంటామని జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి అన్నారు. మంగళవారం నగర పంచాయతీ కార్యాలయ చైర్‌పర్సన్ చాంబర్‌లో విలేకరులతో మాట్లాడుతూ నిరుపయోగంగా మారిన పురాతన రిపబ్లిక్ క్లబ్‌ను ఉచిత వైద్యశిబిరాలకు వినియోగిస్తామన్నారు. నియోజకవర్గంలో ఇసుక అక్రమ రవాణా చేస్తామంటే ఒప్పుకోమన్నారు. స్థానిక అవసరాలకు మాత్రమే ఇసుకను వినియోగించుకోవచ్చన్నారు. బయటి ప్రాంతాలకు తరలించి ఇసుకను అమ్ముకుంటామంటే ఒప్పుకునేది లేదన్నారు. దక్షిణ భాగంలో బైపాస్ రోడ్డుకు సంబంధించి ఆర్డీఓ శ్రీనివాసులుతో తాను మాట్లాడానని, భూసేకరణ వెంటనే జరగాలని చెప్పామన్నారు. నియోజకవర్గానికి స్టీల్‌ప్లాంట్ రావాల్సిందేనని, గండికోట టూరిజం అభివృద్ధి వేగంగా జరగాలన్నారు. ఏసీసీ సిమెంటు కూడా మైలవరానికి వస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు పోలవరం ప్రాజెక్టు, అమరావతి, వైజాగ్, డబుల్ ఇంజన్ సర్కార్‌లో అభివృద్ధి జరుగుతుందన్నారు.

అన్నా క్యాంటిన్ల పునర్జీవంపై హర్షం


నిరుపయోగంగా ఉన్న అన్నాక్యాంటిన్ భవనం

బద్వేలుటౌన్, జూన్ 18: టీడీపీ ప్రభుత్వం ఏర్పడగానే అన్నాక్యాంటిన్ల పునర్జీవంపై పలువురు నిరుపేదలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో అన్నాక్యాంటిన్లను పునరుద్దరిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 4వ సంతకం చేసి పేదల ఆకలితీర్చే మంచిపనికి శ్రీకారం చుట్టారని సామాన్యులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వివిధ పనుల నిమిత్తం పట్టణాలకు వచ్చే సామాన్య ప్రజలకు, పట్టణాల్లో ఉండే పేదలకు రూ.5కే టిఫెన్, భోజనం అందించాలనే మహోన్నత ఆశయంతో టీడీపీ ప్రభుత్వం గతంలో అన్నాక్యాంటిన్లను ఏర్పాటు చేసింది. అందులో భాగంగానే పట్టణంలోని జాతీయ రహదారి మైదుకూరురోడ్డు నాలుగురోడ్ల కూడలి సమీపంలో పేదప్రజల ఆకలిని తీర్చాలనే లక్ష్యంతో అన్నాక్యాంటిన్లను ఏర్పాటు చేశారు. చంద్రబాబు ఆలోచనతో రోజూ వందల మంది పేదల ఆకలి తీర్చేవారు. అన్నాక్యాంటిన్‌లో రూ.5 ఇస్తే వేడివేడిగా శుభ్రంగా భోజనం అందేది. అయితే వైసీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయ కక్షతో పేదలకు పెట్టే పట్టెడన్నాన్ని జీర్ణించుకోలేక జగన్ ప్రభుత్వంలో అన్నా క్యాంటిన్లను నిర్లక్ష్యంగా మూసివేయించారు. అయితే చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక అన్నాక్యాంటిన్లను పునఃప్రారంభించాలని, వందరోజుల్లో ప్రణాళికలను పూర్తిచేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలను జారీచేశారు. రోజూ ఆహారం కోసం వచ్చి కడుపు నింపుకొంటున్న నిరుపేదలు వైసీపీ ప్రభుత్వంలో ఉసూరుమంటూ వెనుతిరిగేవారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో వైసీపీ అరాచకపాలనను ప్రజలు శాశ్వతంగా ఇంటికి పంపించడంతో ప్రజల కూటమి ప్రభుత్వం పేదల ఆకలినీర్చే చంద్రబాబు పాలనకు స్వాగతం పలకడంతో అన్నాక్యాంటిన్లకు నూతన కళచేకూరనుంది. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు అన్నా క్యాంటిన్ల సేవను పునః ప్రారంభించేందుకు సంతకం చేసి అధికారులకు ఆదేశాలు ఇవ్వడంతో ప్రజల్లో ఆనందం వెల్లివిరుస్తోంది.

నిరుపేదలకు ఆకలి తీరుతుంది



నిరుపేదల ఆకలినితీర్చే అన్నా క్యాంటిన్లను ముఖ్యమంత్రి చంద్రబాబు మళ్లీ ప్రారంభించేందుకు ఆదేశాలు జారీచేయడం అభినందనీయం. పనుల నిమిత్తం పట్టణాలకు వచ్చే గ్రామీణులు అన్నాక్యాంటిన్లలో భోజనం చేసి వెళ్లేవారు. ఇప్పుడు రూ.70 నుంచి రూ.100 పెట్టి తినాలంటే కష్టంగా ఉంది. చంద్రబాబు అన్నాక్యాంటిన్లను ప్రారంభించేలా చర్యలు తీసుకోవడం సంతోషం

లక్షుమయ్య, కూరగాయల వ్యాపారి, బద్వేలు

పేదల ఆకలినితీర్చే అన్నాక్యాంటిన్లు



ఎందరో పేదల కడుపునింపి ఆకలినితీర్చే అన్నాక్యాంటిన్లను తిరిగి ప్రారంభిస్తున్నారంటే ఆనందంగా ఉంది. ఇది ఎంతో మంచి నిర్ణయం. చిన్న చిన్న పనుల నమిత్తం పట్టణాలకు వచ్చి, జీవనం సాగించేవారి కోసం అన్నా క్యాంటిన్లలో రూ.5లకే కడుపునిండా భోజనం పెట్టడం సంతోషకరం. ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ నిర్ణయం తీసుకోవడం హర్షణీయం

జార్జి, ఎర్రపాలెం

అనాథ చిన్నారులకు ఆర్థిక సాయం

టీడీపీ యువనేత యాపరాల చిన్న చేదోడు


చిన్నారులకు రూ.50 వేలు ఇస్తున్న యాపరాల చిన్న

మైదుకూరు రూరల్ జూన్ 18: ఒకే నెలలో తల్లిదండ్రులను కోల్పోయి అనాధలుగా మారిన చిన్నారులకు టీడీపీ యువనేత, న్యాయవాది యాపరాల చిన్న యాభై వేల రూపాయల ఆర్థిక సాయం అందించాడు. 'ఒకే నెలలో తల్లిదండ్రులను కోల్పోయి అనాధలుగా మారారు' ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి పాతూరు టీడీపీ యువనేత, న్యాయవాది యాపరాల చిన్న స్పందించారు. అంతేకాకుండా చిన్నారులకు ఇంకా ఎలాంటి సాయం కావాల్సివచ్చినా అడగ వచ్చని తెలిపారు. పాతూరులోని పలువురు మహిళలు ఇంటింటికీ తిరిగి చందాలు వసూలు చేస్తున్నారు.

చైన్ స్నాచర్ అరెస్ట్ - నగలు స్వాధీనం


చైన్‌స్నాచర్‌తో సీఐ సుధాకర్‌రెడ్డి, ఎస్ఐ భక్తవత్సలం

రాయచోటిటౌన్, జూన్18: స్థానిక కొత్తపేట, చెక్‌పోస్టు శివాలయం తదితర ప్రాంతాల్లో మహిళల మెడలో బంగారు గొలుసులను చోరీ చేసిన దొంగను మంగళవారం అరెస్టు చేసి అతని వద్ద నుంచి 66 గ్రాముల మూడు బంగారు చైన్లు స్వాధీనం చేసుకున్నట్లు రాయచోటి అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు. వివరాల్లోకెళితే... కొత్తపల్లె ప్రాంతీయుడు కరీంసాబ్ కుమారుడు షేక్. మహమ్మద్‌మోసిన్ ఈ నెల 9, 10వ తేదీల్లో పట్టణంలోని పలు ప్రాంతాల్లో మహిళల మెడలో గొలుసులను చోరీ చేశాడు. దీనిపై కేసు నమోదు చేసిన రాయచోటి అర్బన్ పోలీసులు మంగళవారం షేక్. మహమ్మద్ మోసిన్‌ను అరెస్టు చేసి అతని నుంచి రూ.4 లక్షలు విలువైన 66 గ్రాముల బంగారు గొలుసులను, సుజుకి బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరుపర్చినట్లు అర్బన్ సీఐ తెలిపారు. ఈ కేసు దర్యాప్తులో అర్బన్ ఎస్ఐ భక్తవత్సలం, పోలీసు సిబ్బంది జగన్, బర్కతుల్లా, మహేంద్ర, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

దాడి కేసులో ముగ్గురు అరెస్టు

పరారీలో ఏఎస్ఐ, ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్

కడప (క్రైం), జూన్ 18: ఆర్టీసీ పాత ఆస్పత్రి ఆవరణలో 2023 డిసెంబరు 30న హెల్పర్ డి.ప్రసాద్‌పై కె.రవికుమార్, కిశోర్‌కుమార్ మరో ఐదుగురితో కలిసి దాడి చేసిన సంఘటనలో ముగ్గురిని అరెస్టు చేసినట్లు సీఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు. అరెస్టైన వారిలో రవికుమార్, ప్రశాంత్, మునీంద్ర ఉన్నారు. ఈ కేసులో నిందితులు వరప్రసాద్ అలియాస్ ప్రసాద్, ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ విజయకుమార్, ఏఎస్ఐ భాస్కర్, కిశోర్‌కుమార్ పరారీలో ఉన్నారు. నిందితుల కోసం విస్తృతంగా గాలిస్తున్నామని, వారిని త్వరలో అరెస్టు చేస్తామని సీఐ వెల్లడించారు.

మగ పెద్దపులి పాదముద్రలు సేకరించాం !


మర్రిపాడు ఘటనపై విచారిస్తున్నాం : డీఎఫ్ఓ


విలేకరులకు పెద్దపులి పాద ముద్రలు చూపుతున్న డీఎఫ్ఓ చంద్రశేఖర్

నెల్లూరు (వెంకటేశ్వరపురం) జూన్ 18: నెల్లూరు జిల్లా మర్రిపాడు మండలం కదిరినాయుడుపల్లి వద్ద సోమవారం పెద్దపులి దాడితో కారు ధ్వంసమైందని జరుగుతున్న ప్రచారం వాస్తవం కాదని జిల్లా అటవీశాఖ అధికారి (డీఎఫ్ఓ) ఏ.చంద్రశేఖర్ తెలిపారు. అయితే మగ పెద్దపులి పాదముద్రలను మాత్రం సేకరించామన్నారు. నెల్లూరులోని నిప్పో సెంటర్ వద్ద గల అటవీశాఖ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఘటన జరిగిన ప్రాంతంలో సేకరించిన ఆధారాల మేరకు పెద్దపులిని ఢీకొన్న కారు భారీగా దెబ్బతిన్నదంటే... పులికి కూడా తీవ్రగాయలు కావాలి కదా..? అని ప్రశ్నించారు. ఒకవేళ పులి గాయపడితే ఎక్కడికీ కదలలేదన్నారు. కదిరినాయుడిపల్లి పరిసరాల్లో నాలుగు కిలోమీటర్ల వరకు పెద్దపులి జాడేలేదన్నారు. పులికి గాయాలైయినట్టు ఆధారాలు లేవన్నారు. దీన్ని బట్టి కారు దేన్ని ఢీకొని దెబ్బతిన్నదో విచారిస్తున్నామన్నారు. ఘటనాస్థలంలో మగ పెద్దపులి పాదముద్రలను సేకరించామన్నారు. కారు డ్రైవర్ శ్రీనివాసులుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. అయితే పెద్దపులి సంచారం ఉన్నట్లు నిర్ధారణ అయినందున చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనుమతి లేనిదే ఎవరూ అడవిలోకి వెళ్లరాదన్నారు. గతంలో సేకరించిన పాదముద్రలు ఆడ పులిదని, ప్రస్తుతం సేకరించినవి మగ పులివని వివరించారు.

అటవీ అధికారుల గాలింపు

మర్రిపాడు, జూన్ 18: కదిరినాయుడుపల్లి అడవిలో పెద్దపులి ఆనవాళ్ల కోసం మంగళవారం అటవీశాఖాధికారులు రెండు బృందాలుగా ఏర్పడి ముమ్మరంగా గాలించారు. ఘటన జరిగిన ప్రాంతంలో రెండు కిలోమీటర్ల మేర అడవిలో డ్రోన్ ఎగర వేసి తద్వారా వీడియో రికార్డు చేశారు. ఈ ప్రమాదానికి కారణం పులిగా నిర్ధారించలేమని ఆత్మకూరు రేంజర్ శేఖర్ తెలిపారు.



వంట మాస్టర్స్ కావలెను
కడప బకెట్ బిర్యాని హోటల్‌లో సౌత్ ఇండియన్ టిఫిన్ సెక్షన్ నందు వంట మాస్టర్ & ఏంజిల్స్ లేడీస్ హస్టల్ నందు లేడి వంట మాస్టర్ కావలెను. జీతం+ఫుడ్ సౌకర్యం కలదు. సెల్ : 98667 68892
Ajc-188767

WANTED
కడప నగరంలో ప్రముఖ రెసిడెన్షియల్ హైస్కూల్ నందు పనిచేయుటకు క్రింద తెలిపిన అభ్యర్థులు కావలెను. లేడీవార్డన్స్ జీతం:12000, లేడి PET's జీతం :15000, సెక్యూరిటీ గార్డ్స్-జీతం : 10వేల నుండి 12వేలు హౌస్ కీపింగ్ వర్కర్స్- జీతం 8000, సెల్ 9059004664, 9849794289
Ajc-156456

AYURVEDA
★ ధనవంతి ఆయుర్వేద పరిహారం మీ లైంగిక సమస్యలకి మా నూతన చికిత్స నుంచి మీ ఇంద్రియమును ఏడు నుండి ఎనిమిది ఇంచులు పొడవు అలాగే 3-4 ఇంచుల లావు చక్కగా దృఢంగా చేసుకోండి. లైంగిక సామర్థ్యాన్ని 30 నుంచి 40 నిమిషాల వరకు పెంచుకోండి. తక్షణమే కాల్ చేయండి. 7411665060 AJH-002397

కంప్యూటర్ ఆపరేటర్ కావలెను
కడప నగరంలోని బెస్ట్ ఫ్లెక్స్ ఫ్లెక్సీ ప్రింటింగ్ షాప్ నందు పనిచేయుటకు ఫోటోషాపు, డిజైనర్ వచ్చిన యువతి యువకులు కావలెను. ఆకర్షణీయమైన జీతం : సెల్ : 6300154940
Ajc-188598

యూనిట్ కార్యాలయం
9985411183
9985411189

బంగారం కొనబడును
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్రః 7382114647
AJA- 189260

ఆంధ్రజ్యోతిలో ప్రకటనల కోసం సంప్రదించండి

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల్లో 67.5 శాతం ఉత్తీర్ణత

రాయచోటి టౌన్, జూన్ 18: ఇంటర్మీడియట్ విద్యాశాఖ మంగళవారం విడుదల చేసిన సెకండ్ ఇయర్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాల్లో అన్నమయ్య జిల్లాలో 67.5 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఇంటర్మీడియట్ విద్యా జిల్లా అధికారి కృష్ణయ్య తెలియజేశారు. అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా 115 కళాశాలల నుంచి 3,881 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా అందులో 2,620 మంది ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. త్వరలోనే ఫస్ట్ ఇయర్ ఫలితాలు రానున్నట్లు ఆయన తెలియజేశారు.

ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశానికి నేడు పరీక్ష

పుల్లంపేట, జూన్ 18 : స్థానిక ఆదర్శ పాఠశాలలో 7, 8, 9 తరగతుల్లో ఖాళీ అయిన సీట్లకు బుధవారం ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ లీలాశ్రీహరి తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు పాఠశాలలో ఉదయం 10.30 గంటలకు జరిగే ప్రవేశ పరీక్షకు హాజరు కావాలని ఆయన కోరారు.

హిందీ మెటీరియల్ వితరణ



విద్యార్థులకు మెటీరియల్‌ను అందజేస్తున్న సర్రాజ్ హుస్సేన్

పుల్లంపేట, జూన్ 18 : మండల పరిధిలోని టీకమ్మపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం ప్రేమ్‌చంద్ హిందీభవన్ సొసైటీ వ్యవస్థాపకుడు సర్రాజ్‌హుస్సేన్ విద్యార్థులకు హిందీ మెటీరియల్‌ను అందించారు. ఈ పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడు లేకపోవడం గమనించి ఈ మెటీరియల్‌ను విద్యార్థులకు అందించారు. దీనిని సద్వినియోగం చేసుకుని మంచి మార్కులు సాధించాలని ప్రధానోపాధ్యాయుడు రఘురాం విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా సర్రాజ్ హుస్సేన్‌ను ఉపాధ్యాయులు రామిరెడ్డి, గంగాధర్, ప్రసాద్ తదితరులు అభినందించారు.

ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న పాలక మండలి సభ్యులు

పెనగలూరు, జూన్ 18 : స్థానిక వేణుగోపాలస్వామి ఆలయంలో సోమవారం రాత్రి ఆలయ పాలకమండలి సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. దేవాలయ ధర్మకర్తగా జలకర సుబ్బయ్య సభ్యులుగా వంటల పుల్లయ్య, అభినేని కృష్ణయ్యనాయుడు, తాటిబోయిన ధనుంజయ్య భర్గల ఈశ్వరమ్మ ప్రమాణస్వీకారం చేశారు. ఆలయ ప్రధాన కార్యదర్శి చెంచు సుబ్బనరసయ్యస్వామి ప్రమాణం చేయించారు.

నెమలి వాహనంపై వేణుగోపాలుడు

పెనగలూరు, జూన్ 18: వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి రుక్మిణి సత్యభామ సమేతుడైన వేణుగోపాలుడు నెమలి వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ధర్మకర్త జలకర సుబ్బయ్యతో పాటు ప్రధాన కార్యదర్శి చెంచు సుబ్బనరసయ్యస్వామి, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు. తిరువీధి చెందిన రాధిక భాగవతారిణి హరికథ వినిపించారు.

భవానీ శంకరుల గ్రామోత్సవం

చిట్వేలి, జూన్ 18 : మండల పరిధిలోని నక్కలపల్లెలో సోమవారం రాత్రి భవాని శంకరస్వామి కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మంగళవారం ఉదయం గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు అరవింద్ శర్మ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.



నంద్యాల	-	ఎఆర్ మినీ
కడప	-	రవి గ్రూప్
అనంతపురం	-	గౌతమి
రాజంపేట	-	ఎవిఎస్ఆర్
రాయచోటి	-	సాయి థియేటర్

CONTACT: 9550740661

ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ



చిన్నప్పనాయుడుతో భూమిపూజ చేయిస్తున్న టీడీపీ నాయకులు

నందలూరు, జూన్ 18: తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారకరామారావు విగ్రహ ఏర్పాటుకు మంగళవారం నందలూరులో భూమిపూజ చేశారు. తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు 103 ఏళ్ల కిల్లారి చిన్నప్పనాయుడు, టీడీపీ మాజీ జిల్లా అధ్యక్షుడు జాగం రామకృష్ణ, ఎంపీటీసీ మాజీ సభ్యుడు నారా ప్రభాకర్ నాయుడు టెంకాయ కొట్టి పనులు ప్రారంభించారు. 9 అడుగుల ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు చేసి రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభిస్తామన్నారు. తెలుగుదేశం పార్టీ కోసం కృషి చేసిన మహనీయుడు నందమూరి తారక రామారావు అని, ఆయన చిత్రపటానికి పూలమాల వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు శేఖర్‌రెడ్డి, గోపాల్, ఎంపీటీసీ సభ్యుడు రామరాజు, దుద్యాల కోటేశ్వరరెడ్డి, గోపీనాథ్‌రెడ్డి, శివప్రసాద్ రెడ్డి, మైనార్టీ మునాఫ్, కృష్ణంనాయుడు, విశ్వనాథరెడ్డి, రేవన శివప్రసాద్, సిద్ధారెడ్డి, కొండమర్ల రామచంద్ర, ఆంజనేయులు, మట్లి వేణుగోపాల్, శ్రీనివాసనాయుడు, సహదేవరెడ్డి, బీదం రమేశ్, యాదవ్ తెలుగు యువత హరి, రాజశేఖర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గోహంతకులపై కఠిన చర్యలు తీసుకోవాలి : వీహెచ్‌పీ



మాట్లాడుతున్న విశ్వహిందూ పరిషత్ సభ్యులు

పుల్లంపేట, జూన్ 18 : హిందువులు దైవంగా భావించే గోవులను వధిస్తూ పైశాచికానందం పొందుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని విశ్వహిందూ పరిషత్ సభ్యులు డిమాండ్ చేశారు. మంగళవారం పుల్లంపేటలోని సభా ఉన్నత పాఠశాలలో విశ్వహిందూ పరిషత్ సభ్యులు సమావేశమై గోవధపై పోరాటాలను ముమ్మరం చేయాలని తీర్మానించారు. బక్రీద్ సందర్భంగా రాజంపేట, చిట్వేలి ప్రాంతాల్లో గోవధ చేసిన అంశాన్ని అధికారులు దృష్టికి తీసుకెళ్లి కేసులు నమోదు చేయించామన్నారు. విశ్వహిందూ పరిషత్‌తో పాటు భజరంగదళ్, ధార్మిక సంస్థలు వినతిపత్రాలు ఇచ్చినా కొందరు అధికారుల్లో చలనం లేదన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే ప్రత్యక్ష ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు.

ప్రైవేటు విద్యాసంస్థల దోపిడీని అరికట్టాలి



ప్రైవేటు పాఠశాల ఎదుట నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘ నేతలు

రాజంపేట, జూన్ 18 : ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలు విద్యార్థుల తల్లిదండ్రులను నిలువుదోపిడీ చేస్తున్నాయని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు నాగేశ్వర, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నర్సింహ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని పలు పాఠశాలల యెదుట ఆందోళన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో ప్రైవేటు కార్పొరేట్ విద్యాసంస్థలు, విద్యాహక్కు చట్టానికి భిన్నంగా వేల రూపాయలు ఫీజులు వసూలు చేస్తున్నాయని తెలిపారు. స్పెషల్ పేరుతో పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, టై, బెల్టు, ఐడీ కార్డు, మా పేరుతో వేలకు వేలు అర్జిస్తున్నారన్నారు. ప్రైవేటు కార్పొరేట్ విద్యాసంస్థల విచ్చలవిడిగా ప్రవర్తిస్తున్నా విద్యాశాఖ అధికారులు గాఢనిద్రలో ఉన్నారని ఆరోపించారు. గుర్తింపు లేకున్నా అడ్మిషన్లు స్వీకరిస్తున్నా విద్యాశాఖ అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రమణ, విద్యార్థి సంఘ నాయకులు చెంగయ్య, మనోహర్, హరి తదితరులు పాల్గొన్నారు.

స్వీపర్ల వేతన బకాయిలు వెంటనే చెల్లించండి

● డీఈవో కార్యాలయం వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా



డీఈవో కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న స్వీపర్లు

రాయచోటిటౌన్, జూన్ 18: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న స్వీపర్ల వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, ఏఐటీయూసీ పీలేరు నియోజకవర్గ కార్యదర్శి నరసింహులు డిమాండ్ చేశారు. మంగళవారం అన్నమయ్య జిల్లా డీఈవో కార్యాలయం వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి డీఈవో శివప్రకాశ్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ 2023 సెప్టెంబరు, అక్టోబరు నెలలతో పాటు 2024 జనవరి నుంచి మే నెల వరకు వేతనాలు చెల్లించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. 7 నెలలుగా వేతనాలు రాకపోవడంతో కుటుంబ పోషణకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఒకవైపు నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగిపోతుంటే, మరోవైపు ఏళ్ల తరబడి వేతనాలు పెంచకపోవడంతో ప్రభుత్వం ఇచ్చే రూ.6 వేలు ఏ మాత్రం సరిపోవడం లేదన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, గుర్తింపు కార్డులు, యూనిఫాం ఇవ్వాలని నూతన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి సుదీర్‌కుమార్, ఏఐటీయూసీ నాయకులు మురళి, యశోద, నాగరత్నమ్మ, సంధ్య, నూర్జహాన్, లక్ష్మీదేవి, నీలావతి, భారతమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నాగారపమ్మ జాతర





ప్రత్యేక అలంకరణలో నాగారపమ్మ, ఆకట్టుకుంటున్న చాందినీ బండ్లు

సుండుపల్లె, జూన్18: నాగారపమ్మ ఉత్సవాల్లో భాగంగా మూడు రోజుల ప్రత్యేక పూజలతో పాటు, వివిధ రకాల కార్యక్రమాల అనంతరం ప్రధాన తిరునాల సోమవారం రాత్రి నుంచి మంగళవారం మధ్యాహ్నం వరకు వైభవంగా జరిగింది. అన్నమయ్య జిల్లా నుంచే కాక చిత్తూరు, కడప, అనంతపురం, జిల్లాల భక్తులతో పాటు కర్నాటక, తమిళనాడు, మహారాష్ట్రలలో స్థిరపడిన ఈ ప్రాంతీయులతో కలిసి వేలాది మంది అమ్మవారిని దర్శించుకున్నారు. సోమవారం రాత్రి నుంచే భక్తులు దర్శనానికి రావడంతో ఆలయం కిటకిటలాడింది. మంగళవారం తెల్లవారుజామున చాందినీ బండ్లు, భక్తులు ఒక్కసారిగా పెద్ద ఎత్తున రావడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో పోటెత్తింది. సోమవారం అర్ధరాత్రి నుంచి వర్షం ప్రారంభం కావడంతో భక్తులు వర్షానికి తడుస్తూ అమ్మవారిని దర్శించుకున్నారు.

ఆకర్షణీయంగా చాందినీ బండ్లు

నాగారపమ్మ జాతరకు వచ్చిన చాందినీ బండ్లు, బండ్ల వెంట ఏర్పాటు చేసుకున్న భజనలు, కోలాటాల భక్తులను ఆకట్టుకున్నాయి. మంగళవారం ఉదయం వివిధ ప్రాంతాల భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రాయచోటి డీఎస్పీ రామచంద్రరావు పర్యవేక్షణలో సీఐలు తులసీరాం, గంగాధరరావు, సుండుపల్లి ఎస్ఐ హుస్సేన్‌ల ఆధ్వర్యంలో పలువురు ఎస్ఐలు, ఏఎస్ఐలు, పోలీసులు, మహిళా పోలీసులు, హోంగార్డులు, ప్రత్యేక పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు.

ప్రభుత్వ కార్యాలయాల దారి గోతులమయం



తహసీల్దారు కార్యాలయానికి వెళ్లే మార్గంలో ఏర్పడిన గోతుల్లో నిలచిన వర్షపు నీరు

లక్కిరెడ్డిపల్లె, జూన్ 18: మండల కేంద్రంలో కార్యాలయాల సముదాయానికి వెళ్లే దారులు గోతులమయమయ్యాయి. ఏళ్ల తరబడి ఈ మార్గం ఇలాగే ఉన్నా, రోజూ అధికారులు ఈ దారిలో వచ్చి వెళుతున్నా ఏ ఒక్కరూ ఈ గోతులను పూడ్చాలని ఆనుకున్న పాపాన పోలేదు. సాధారణ రోజుల్లోనే ఈ మార్గంలో వెళ్లాలంటే ప్రజలు భయపడుతుంటారు. ఇక వర్షం వస్తే పరిస్థితి దుర్భరంగా మారుతుంది. గోతులన్నింటిలో నీరు నిలవడంతో ఏ ప్రాంతంలో ఏ గొయ్యి ఉందో తెలియక ప్రజలు ప్రమాదాలపాలవుతున్నారు. ఇక పోలీసు స్టేషన్ ఆవరణ వర్షాకాలంలో చెరువులా మారుతుంది. దీంతో ఈ రెండు కార్యాలయాలకు వచ్చే ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లేదారితోపాటు, కార్యాలయాల ఆవరణలు చదును చేసి నీరు నిలవకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



ఆగని వైసీపీ నాయకుల ఆగడాలు

నందలూరు, జూన్ 18 : నందలూరు మండలంలో వైసీపీ నాయకుల ఆగడాలు మితిమీరిపోతున్నాయని, ఇటీవల జరిగిన ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చినా, జిల్లాలోని కొన్ని మండలాల్లో వైసీపీ నాయకుల పెత్తనం జోరుగా సాగుతుందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి విజయ్‌భాస్కర్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండల పరిషత్ కార్యాలయంలో వైసీపీ ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి ప్రజాప్రతినిధులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా సమావేశాన్ని నిర్వహించారని ఆరోపించారు. ఈ విషయాన్ని తెలుసుకున్న తాను కార్యాలయం వద్దకు వెళ్లి మండల అభివృద్ధి అధికారి ప్రకాష్‌ను ప్రశ్నించాన్నారు.ప్రజాప్రతినిధులు, అధికారులకు ముందస్తుగా తెలుపకుండా సమావేశం ఎలా నిర్వహిస్తారని అడిగానన్నారు. దీంతో కొంతమంది వైసీపీ నాయకులు తనతో వాగ్వాదం చేశారని తెలిపారు. విషయం తెలుసుకున్న నందలూరు పోలీసులు మండల అభివృద్ధి కార్యాలయానికి చేరుకుని ఇరువర్గాల నాయకులకు సర్దిచెప్పారు.

ఇసుక తరలిస్తున్న టిప్పర్లు, ఎక్స్‌కవేటర్ స్వాధీనం

నందలూరు, జూన్ 18 : మండలంలోని ఆడపూరు గ్రామ పంచాయతీ మిట్టపల్లె గ్రామ సమీపంలోని చెయ్యేరునది నుంచి సోమవారం రాత్రి ఇసుక అక్రమ రవాణా చేస్తుండగా ఎస్ఈబీ, పోలీసు అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మహమ్మద్‌అబ్దుల్ జహీర్ మాట్లాడుతూ ఈ దాడుల్లో 2 టిప్పర్లు, ఒక ఎక్స్‌కవేటర్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎస్ఈబీ వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

బస్టాండులో వసతులు కల్పించాలని మంత్రికి వినతి



మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న రూపానందరెడ్డి, ఎమ్మెల్యే అరవ శ్రీధర్

రైల్వేకోడూరు, జూన్ 18: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండులో ఆధునాతన వసతులు కల్పించాలంటూ రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి, రైల్వేకోడూరు జనసేన పార్టీ ఎమ్మెల్యే అరవ శ్రీధర్ మంగళవారం విజయవాడలో రాష్ట్ర రవాణా, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఆర్టీసీ బస్టాండును పట్టించుకోలేదన్నారు. అనంతరం రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని కలిసి సన్మానించారు. రైల్వేకోడూరు, పుల్లంపేట, చిట్వేలి, పెనగలూరు, ఓబులవారిపల్లె మండలాల్లో అవసరమైన రోడ్లు, బ్రిడ్జిలు మంజూరు చేయాలని కోరారు. గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ను కలిసి మంగంపేట గనుల్లో జరిగిన అక్రమాలపై వివరించామన్నారు. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం అభివృద్ధి చేసి చూపించాలనే తపనతో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్‌కళ్యాణ్‌తో పాటు మంత్రులను కలిసి విన్నపాలు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ యువనాయకుడు ముక్కా సాయివికాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ అవినీతి అక్రమాలపై మంత్రికి ఫిర్యాదు

సంబేపల్లె, జూన్ 18: వైసీపీ హయాంలో మండల వ్యాప్తంగా జరిగిన అవినీతి అక్రమాలను రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు మాజీ జెడ్పీటీసీ మల్లు నరసారెడ్డి మంగళవారం తెలిపారు. జలజీవన్ మిషన్, హౌసింగ్, జగనన్న లేఅవుట్లు, సిమెంటు రోడ్లు, సచివాలయ నిర్మాణాలు, ఉపాధి హామీ తదితర పనుల్లో జరిగిన అవినీతి, అక్రమాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లగా, విచారణ చేయించి వాస్తవాలను బయటకి తీస్తామని హామీ ఇచ్చారన్నారు. మంత్రి సహాయ సహకారాలతో మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని తెలియజేశారు. అన్ని గ్రామాల్లో ప్రజా సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నారెకరాల రంగారెడ్డి, మల్లు విష్ణువర్ధన్‌రెడ్డి, సుబ్బరాయుడు యాదవ్, బాస్కర్‌రెడ్డి, వేణుగోపాల్ నాయుడు, నాగార్జునరెడ్డి, శివారెడ్డి, గోపాల్‌నాయుడు, పలువురు టీడీపీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

టైలరింగ్‌లో రాణించాలి



మహిళలతో మాట్లాడుతున్న పార్థసారథి

రైల్వేకోడూరు, జూన్ 18: మహిళలు టైలరింగ్‌లో రాణించాలని గ్లోబల్ సర్వీస్ ట్రస్ట్ చైర్మన్ కె. పార్థసారధి సూచించారు. మంగళవారం స్థానిక శిక్షణ కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ సంస్థ మహిళలకు టైలరింగ్‌లో శిక్షణ ఉచితంగా ఇస్తోందన్నారు. శిక్షణ పొందిన ప్రతి మహిళ ఆధునాతన మెళకువలు నేర్చుకునేందుకు ప్రయత్నించాలన్నారు. టైలరింగ్ యూనిట్లు పెట్టుకునేందుకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీ రుణాలపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ కో-ఆర్డినేటర్ బావన, శిక్షకులు పాలెంకోట పద్మావతి, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

దారి అడ్డుకున్నారని కలెక్టర్‌కు వినతి



కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేస్తున్న గట్టు గ్రామస్తులు

రాయచోటి(కలెక్టరేట్), జూన్ 18: గ్రామానికి వెళ్లే దారిని మూసివేసి ఓ మహిళ ఇబ్బందులు పెడుతోందని బీకొత్తకోట మండలం కొత్త పల్లివాసులు మంగళవారం కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. ఆ మహిళ సిమెంటు పలకలను దారికి అడ్డువేసి ఎవరినీ అటువైపు వెళ్లకుండా దౌర్జన్యం చేస్తోందని వారు అర్జీలో పేర్కొన్నారు. ఊరిలో జరిగే అమ్మవారి జాతరకు కూడా వెళ్లకుండా అడ్డుకుంటోందన్నారు. ఈ దారి విషయాన్ని పరిష్కరించి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వారికి హామీ ఇచ్చారు.

ఏపీజీబీ ఫీల్డ్ ఆఫీసర్ గోపీకృష్ణకు సన్మానం



ఫీల్డ్ ఆఫీసర్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

ఓబులవారిపల్లె, జూన్ 18 : ఓబులవారిపల్లె ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో పనిచేసే ఫీల్డ్ ఆఫీసర్ గోపీకృష్ణ బదిలీ సందర్భంగా స్థానికులు ఆయనను సన్మానించారు.మేనేజర్ గురురామచంద్రారెడ్డి, చిన్నఓరంపాడు మేనేజర్ సురేంద్ర, క్యాషియర్ శ్రీనివాసులు, వరలక్ష్మి, చలపతి, ఆచారి హరికృష్ణ, చెంగలరాయుడులు బ్యాంకు సిబ్బందితో పాటు పలువురు పాల్గొన్నారు.

ఇసుక మాఫియాపై చర్యలు తీసుకోవాలి

రాయచోటిటౌన్, జూన్ 18: ఇసుక మాఫియా సామాన్య ప్రజలను దోచుకుంటోందని భారతీయ జనతా పార్టీ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి బీర్ల శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాయచోటితో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో కొంత మంది అక్రమంగా స్టాక్ పాయింట్లను నిర్వహిస్తూ ప్రజలను నిలువు దోపిడీ చేస్తున్నారన్నారు. ప్రభుత్వం మారినా ఇసుక దళారీలకు, స్టాక్ పాయింట్ నిర్వాహకులకు వారికి దినదినాభి వృద్ధిగా ఉందన్నారు. కొత్త ఇసుక పాలసీ ప్రకటించేవరకు ఇసుక రీచ్‌లను, స్టాక్ పాయింట్లను సీజ్ చేయాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందన్నారు. గతంలో ప్రజలను దోచుకున్న వారిపై విచారణ చేసి తగు చర్యలు తీసుకోవాలని ఆయన నూతన ప్రభుత్వాన్ని కోరారు.

'గడిచిన ఐదేళ్లు ఒక పీడకల'



సమావేశంలో మాట్లాడుతున్న రమేష్

రైల్వేకోడూరు, జూన్ 18: గడిచిన ఐదేళ్లు ఒక పీడకల అని, చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయడం ద్వారా రాబోవు ఐదేళ్లలో ప్రజలకు మంచి జరుగుతుందని రాజంపేట పార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షుడు పులెల రమేష్‌బాబు తెలిపారు. మంగళవారం రైల్వేకోడూరులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో ప్రజలు, కార్మికులు, రైతులు, అధికారులు, ఉపాధ్యాయులు తదితరులు అనేక ఇక్కట్లు ఎదుర్కొన్నారన్నారు. ప్రజలందరూ ప్రాణాలను పిడికిలిలో పెట్టుకుని బతికారన్నారు. కూటమి విజయంతో ప్రజల్లో నూతన ఉత్సాహం ఉప్పొంగుతుందన్నారు. ఈ సమావేశంలో టీడీపీ మైనార్టీ రాష్ట్ర కార్యదర్శి షేక్ మెహతాజ్, మండల కార్యదర్శి తేనేపల్లి చిన్నా, నాయకులు తిమోతి, సుబ్బరాయుడు, జక్రియా తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్రకు సంఘీభావం



పాదయాత్రకు సంఘీభావం తెలిపిన టీడీపీ నేతలు

సిద్ధవటం, జూన్ 18 : కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో జ్యోతి క్షేత్రం నుంచి కందుకూరు సమీపంలోని నరసింహస్వామి సన్నిధి వరకు పాదయాత్ర చేస్తున్న సిద్ధవటం మండలం జ్యోతి పంచాయతీకి చెందిన కొండవీటి సింహం, టీడీపీ అభిమా నులను స్థానిక టీడీపీ నేతలు శాలువతో సత్కరించి పూలమాల వేసి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో పత్తూ రామచంద్రయ్య, రాజశేఖర్‌యాదవ్, కాకే చెంచయ్యనాయుడు, రామ్మోహన్‌నాయుడు, వాంతిరిపల్లె సుబ్బారెడ్డి, జ్యోతి గంగానందరెడ్డి, మిట్టపల్లె నాయకులు అంబటిపు ఓబులేశు నాయుడు, పత్తూ శివానంద తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి



గాలివీడులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి

గాలివీడు, జూన్18: చంద్రబాబు నాయకత్వంలోనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకనాథరెడ్డి, టీడీపీ నాయకులు మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి అన్నారు. మంగళవారం వారు మండల కేంద్రంలో వర్షలేఖలో ఆసంత రం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ నవ్యాంధ్ర అభివృద్ధి చంద్రబాబుకే సాధ్యమన్నారు. ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన వెంటనే నిరుద్యోగులకు మెగా డీఎస్సీ ప్రకటించడం హర్షణీయమన్నారు. అన్న క్యాంటీన్ల ప్రారంభం పేదవారి ఆకలిని తీర్చే మహోన్నత వ్యక్తి చంద్రబాబు అని కొనియాడారు. ప్రజా సంక్షేమం కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టి అమలు చేసిన ఘనత ఆయనకే దక్కుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటర్ ద్వితీయ సప్లిమెంటరీలో
59శాతం ఉత్తీర్ణత

ఫస్టియర్, బెటర్‌మెంట్ ఫలితాలు 26న

ఇకపై రీకౌంటింగ్ ఉండదన్న అధికారులు

అమరావతి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల్లో ద్వితీయ సంవత్సరంలో 59శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఆన్‌లైన్ మూల్యాంకనంతో జరిగిన జాప్యం వల్ల కేవలం ద్వితీయ సంవత్సరం సప్లిమెంటరీ ఫలితాలను ఇంటర్ విద్యామండలి మంగళవారం విడుదల చేసింది. కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ వీవీ సుబ్బారావు వివరాలు వెల్లడించారు. జనరల్ కోర్సుల విద్యార్థులు 115319 మంది పరీక్షలు రాయగా 68070(59శాతం) ఉత్తీర్ణులయ్యారని, ఒకేషనల్ విద్యార్థులు 11871 మందికిగాను 6798(57శాతం) ఉత్తీర్ణత సాధించారని వివరించారు. మొత్తంగా 58.86శాతం ఉత్తీర్ణత నమోదైందని తెలిపారు. కేటగిరీల వారీగా చూస్తే అబ్బాయిలు 59శాతం, అమ్మాయిలు 58శాతం మంది పాసయ్యారు. ఈ ఏడాది పబ్లిక్ పరీక్షలతో కలిపి చూస్తే జనరల్ విద్యార్థులు 87శాతం మంది, ఒకేషనల్ విద్యార్థులు 84శాతం మంది సెకండియర్‌లో ఉత్తీర్ణులై బయటకు వెళ్లారని తెలిపారు. ఈ ఏడాది సప్లిమెంటరీ పరీక్షలను ఆన్‌లైన్ విధానంలో మూల్యాంకనం చేశామని, అందువల్ల రీకౌంటింగ్ ఉండదని పేర్కొన్నారు. డిజిటల్ విధానంలో కౌంటింగ్ పొరపాట్లు రావన్నారు. రీవెరిఫికేషన్ కావాలంటే ఈనెల 20 నుంచి 25లోగా దరఖాస్తు చేసుకోవాలని, ఒక్కో పేపరుకు రూ.వెయ్యి ఫీజు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఇకపై రెగ్యులర్ పరీక్షల మూల్యాంకనం కూడా ఆన్‌లైన్‌లోనే చేయనున్నట్లు వివరించారు. సప్లిమెంటరీ ఉత్తీర్ణతలో జిల్లాల వారీగా చూస్తే జనరల్ కేటగిరీలో పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, పల్నాడు జిల్లాలు టాప్‌లో ఉన్నాయి. పశ్చిమ గోదావరి, కోనసీమ, కృష్ణా జిల్లాలు చివరన నిలిచాయి. ఒకేషనల్‌లో పార్వతీపురం మన్యం, నెల్లూరు, శ్రీకాకుళం ముందుండగా, కడప, కర్నూలు, విశాఖపట్నం అట్టడుగున ఉన్నాయి. కాగా ఫస్టియర్ సప్లిమెంటరీ, బెటర్‌మెంట్ ఫలితాలను ఈనెల 26న విడుదల చేస్తామని తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి



మౌనిక (ఫైల్ ఫొటో)

తవణంపల్లె, జూన్ 18: వివాహిత అనుమానాస్పదంగా మృతిచెందిన ఘటన తవణంపల్లెలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. తవణంపల్లెకు చెందిన అరుణకుమార్ ఎగువతవణంపల్లె అరుధంతివాడకు చెందిన మౌనిక(22)ను నాలుగేళ్ల క్రితం ప్రేమించి పెళ్లిచేసుకున్నాడు. వీరికి 18 నెలల కుమార్తె ఉంది. తవణంపల్లెలో బాడుగ ఇంట్లో కాపురముంటున్నారు. సోమవారం సాయంత్రం భర్త ఇంట్లోలేని సమయంలో మౌనిక ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. గ్రామస్తుల సమాచారం మేరకు పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.అల్లుడిపై అనుమానం ఉందని మృతురాలి తల్లి సంధ్యాదేవి ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసునమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వయోవృద్ధుల దర్శనంపై
పుకార్లను నమ్మొద్దు : టీటీడీ

తిరుమల, జూన్18(ఆంధ్రజ్యోతి):తిరుమలలో వయోవృద్ధుల దర్శనానికి సంబంధించి తప్పుదోవ పట్టించే కొన్ని వార్తలు సోషల్‌మీడియాలో చక్కర్లు కొడుతున్నాయని టీటీడీ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొంది. ' రోజూ వెయ్యిమంది వయోవృద్ధులకు, దివ్యాంగులకు దర్శనాలకు సంబంధించి టీటీడీ ప్రతి నెలా 23వ తేది మధ్యాహ్నం 3 గంటలకు మూడు నెలల ముందుగానే ఆన్‌లైన్ కోటాను విడుదల చేస్తోందని తెలిపింది. ప్రస్తుతం ఆన్‌లైన్ టికెట్లు ఆగస్టు నెల వరకు బుక్కయ్యాయని పేర్కొంది. టికెట్ పొందిన వ్యక్తికి రూ.50విలువ చేసే లడ్డూ ఉచితంగా లభిస్తుందని,తిరుమల నంబి ఆలయానికి ఆనుకుని ఉన్న సీనియర్ సిటిజన్(పీహెచ్‌సీ) లైన్ ద్వారా రోజూ మధ్యాహ్నం 3 గంటలకు శ్రీవారి దర్శనానికి అనుమతిస్తారని వివరించింది.కాబట్టి సోషల్‌మీడియాలో ప్రచారమవుతున్న తప్పుడు వార్తలను నమ్మవద్దని టీటీడీ కోరింది. దీనికి సంబంధించిన వివరాల కోసం 'తిరుమల. ఓఆర్జీ', 'టీటీదేవస్థానమ్స్.ఏపీ.జీవోవీ.ఇన్' అనే వెబ్‌సైట్లను సంప్రదించాలని సూచించింది.

నేటినుంచి శ్రీవారి జ్యేష్ఠాభిషేక ఉత్సవాలు

తిరుమల, జూన్18(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో బుధవారం నుంచి మూడురోజుల పాటు జ్యేష్ఠాభిషేక ఉత్సవాలు జరుగనున్నాయి. అభిషేకాలు, పంచామృత స్నపన తిరుమంజనాల కారణంగా శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి ఉత్సవమూర్తులు అరిగిపోకుండా జాగ్రత్తలు తీసుకునేందుకు వైఖానస ఆగమోక్తంగా నిర్వహించే ఉత్సవమే జ్యేష్ఠాభిషేకం. మొదటిరోజు ఉత్సవమూర్తులకు హోమాలు, అభిషేకాలు, పంచామృత స్నపనతిరుమంజనం నిర్వహిస్తారు. తర్వాత స్వామి, అమ్మవార్లకు వజ్రకవచాన్ని అలంకరించి మాడవీధుల్లో ఊరేగిస్తారు. రెండవరోజు ముత్యాల కవచ సమర్పణ చేసి ఊరేగిస్తారు. మూడవరోజు కూడా తిరుమంజనాదులు పూర్తిచేసి బంగారు కవచాన్ని సమర్పించి ఊరేగింపు నిర్వహిస్తారు. ఈ బంగారు కవచాన్ని మళ్లీ వచ్చే ఏడాది జ్యేష్ఠాభిషేకంలోనే తీస్తారు. అంతవరకూ శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి బంగారు కవచంతోనే ఉంటారు. కాగా, జ్యేష్ఠాభిషేకం కారణంగా శ్రీవారి ఆలయంలో జూన్21వ తేదీ కల్యాణోత్సవ, ఊంజల్‌సేవ, ఆర్జితబ్రహ్మోత్సవ సేవలను టీటీడీ రద్దు చేసింది. తోమాల, అర్చన సేవలను ఏకాంతంగా నిర్వహిస్తారు.

24 నుంచీ ఏపీఆర్‌సెట్ ఇంటర్వ్యూలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 18: రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో పీహెచ్‌డీ ప్రవేశానికి నిర్వహించిన ఏపీఆర్‌సెట్ ఇంటర్వ్యూలు ఈ నెల 24 వ తేదీ నుంచీ చేపట్టనున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఏపీఆర్‌సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ బి. దేవప్రసాదరాజు మంగళవారం తిరుపతిలో వెల్లడించారు. 24 నుంచీ 28 వ తేదీ వరకూ ఇంటర్వ్యూల ప్రక్రియను నిర్వహిస్తామన్నారు. రాష్ట్రంలోని ఎంపిక చేసిన 12 యూనివర్సిటీల్లో ఇంటర్వ్యూలు చేపడుతున్నట్లు తెలిపారు. 10 వేల మంది ప్రవేశ పరీక్షలకు దరఖాస్తు చేయగా, ఇందులో 4,352మంది ఉత్తీర్ణత సాధించారని చెప్పారు. ఉత్తీర్ణులైన వారికి ఆయా యూనివర్సిటీల్లోని సంబంధిత డిపార్ట్‌మెంట్లలోనే ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. సమగ్ర వివరాల కోసం.. హెచ్‌టీటీపీఎస్.సెట్స్.ఏపీఎస్‌సీహెచ్ఈ.ఏపీ.గవర్నమెంట్, ఇన్.. వెబ్‌సైట్ చూడాలని కన్వీనర్ దేవప్రసాదరాజు కోరారు.

కౌండిన్య నది నిండా గుంతలే. ఇసుక కోసం బావులను తలపించేలా యంత్రాలతో తవ్వేశారు. పక్క రాష్ట్రాలకు అక్రమంగా తరలించారు. లీజు కాలం ముగియడంతో రీచుల్లోను, ఎక్కడా ఇసుక తీయరాదని.. అలా చేస్తే చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. మరోవైపు ప్రభుత్వమూ మారింది. అయినా ఇసుకాసురులు చెలరేగిపోతూనే ఉన్నారు.

- పలమనేరు

'కౌండిన్య' నిండా గుంతలే

నిషేధమున్నా ఆగని ఇసుక తవ్వకం ● ప్రభుత్వం మారినా చెలరేగుతున్న స్మగ్లర్లు





పలమనేరు సమీపంలో కౌండిన్య నదిలో ఇసుక తోడేయడంతో అడ్రస్ లేకుండా పోయిన చెక్‌డ్యామ్ ఉన్న ప్రదేశం - గుంతలు పడిన కౌండిన్య నది

పలమనేరు, గంగవరం మండలాల్లో ప్రవహిస్తున్న కౌండిన్య నది నుంచి ఇసుక స్మగ్లింగ్ ఆగడం లేదు. ప్రభుత్వం మారినా అక్రమ రవాణా సాగుతూనే ఉంది. దొంగలు దొంగలు ఊర్లు పంచుకొన్నట్లు ఇసుక స్మగ్లర్లు కౌండిన్య నదిని పంచుకొని యథేచ్ఛగా గత నాలుగేళ్లగా ఇసుక అక్రమ రవాణా సాగిస్తున్నారు. కేవలం మూడు కిలోమీటర్ల దూరంలో ఇసుక అక్రమ రవాణా సాగుతున్నా ఆర్డీఓ, తహసిల్దార్, పోలీసు స్టేషన్లు, భూగర్భ జల వనరుల శాఖ అధికారి కార్యాలయాలున్నా పట్టించుకోలేదు. దశాబ్ద కాలంగా ఇసుక అక్రమ రవాణాకు అలవాటు పడిన కొందరు.. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆపార్టీ నాయకులు, ప్రజాప్రతినిధుల అండతో చెలరేగిపోతున్నారు. గత ప్రభుత్వ హయాంలో పలమనేరు మున్సిపాలిటీలోని ఇద్దరు మహిళా కౌన్సిలర్ల భర్తలు ప్రతిరోజు కౌండిన్య నదిలో నీళ్లున్నా ఎక్స్‌కవేటర్ల సాయంతో ఇసుకను నీటినుంచి తోడి ట్రాక్టర్లలో నింపుకొంటూ అక్రమ రవాణా చేస్తూ వచ్చారు. పలమనేరు గ్రామ పంచాయితీ స్థాయిలో ఉన్నప్పుడు ఈ కౌండిన్య నదిలో పట్టణానికి తాగునీటి సరఫరా కోసం బోర్లు వేసి పంప్ హౌస్ నిర్మించారు. అంతేకాక ఈ పంప్ హౌస్‌సమీపంలో చెక్‌డ్యామ్ కూడా నిర్మించారు. ఈ చెక్ డ్యాంలో నీరు నిల్వ ఉన్నందున పంప్ హౌస్ వద్ద ఏర్పాటు చేసిన బోర్లలో పుష్కలంగా నీరు లభించేది. వేసవిలోనూ తాగునీటి సమస్య తలెత్తేది కాదు. గత ప్రభుత్వ హయాంలో అధికార పార్టీ నేతలే ఇసుక స్మగ్లింగ్ చేపట్టారు. ఒక ట్రాక్టరు ఇసుక రూ. 1500 పలుకుతున్న సమయంలో వీరు.. ధరను రూ.3500 నుంచి రూ.4 వేలకు పెంచేశారు. దీంతో గృహనిర్మాణదారులు గత్యంతరం లేక వీరి వద్దనే ఇసుకను కొనుగోలు చేసేవారు. మరి కొందరు సంపన్నులు మాత్రం చిత్తూరు సమీపం నుంచి టిప్పర్లలో ఇసుకను రూ. 24వేలనుంచి రూ. 27 వేల వరకు కొనుగోలు చేసి ఇంటి నిర్మాణాలకు వినియోగించుకొన్నారు. ఇక గంగవరం మండలంలోని నల్లగుట్లపల్లి, జీడిమాకులపల్లి, కొంగోళ్ల పల్లి, చెన్నారెడ్డిపల్లి గ్రామాల్లో కొందరు రైతులూ ఇసుక అక్రమ రవాణాకు శ్రీకారం చుట్టారు. వీళ్లూ కౌండిన్య నదిలో ఇసుకను తరలించి లక్షలాది రూపాయలు సొమ్ము చేసుకొన్నారు. కాగా, ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోకుండా వీరు అధికారులతో 'ఒప్పందం' కుదుర్చుకున్నారన్న విమర్శలున్నాయి. మరోవైపు ఇసుకాసురులు తమలో తాము పోటీ పడకుండా కౌండిన్య నదిని ఎవరికి వారు పంచుకుని హద్దులు పెట్టుకున్నారు. ఆ ప్రాంతాల్లో మాత్రమే ఇసుక తవ్వి.. తరలిస్తున్నారు. వీరిలో కొందరు ఎన్నికల ముందు వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు.



గంగవరం మండలం కురప్పల్లి వద్ద మంగళవారం ఇసుక తరలిస్తుండగా పట్టుబడిన ఇసుక ట్రాక్టర్

ఇసుక ట్రాక్టర్ సీజ్

రాష్ట్రంలో అధికారం మారిందనో లేదా ఇక్కడి పోలీసులకు ఇసుక అక్రమ రవాణా నేరమని ఇప్పటికి తెలిసిందో ఏమోగానీ.. మంగళవారం ఇసుక ట్రాక్టరును పట్టుకున్నారు. గంగవరం మండలం చెన్నారెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఒక ట్రాక్టరులో ఇసుక అక్రమంగా తరలిస్తుండగా కురప్పల్లి గ్రామం వద్ద పట్టుకొని ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించారు. మరి ఈ అక్రమ రవాణా పై పోలీసులు కేసు నమోదు చేస్తారా లేదా అనేది చూడాలి. గతంలో ఇసుక అక్రమ రవాణాపై పత్రికల్లో వార్తలు వచ్చిన ప్రతిసారి పోలీసులు ట్రాక్టర్లను పట్టుకొని అమాయకులైన డ్రైవర్లపై కేసులు పెట్టి చేతులు దులుపుకొంటూ వచ్చారు. అంతేగానీ ఇసుక అక్రమ రవాణా సూత్రధారులపై కేసుల్లేవు.

టీడీపీ అడ్డుకున్నా..

పంపు హౌస్ సమీపంలో రెండేళ్ల కిందట ఇసుక తవ్వి ట్రాక్టర్లలో తరలిస్తుండగా తెలుగుదేశం పార్టీ నాయకులు అడ్డుకొన్నారు. వీరి ఫిర్యాదులను పోలీసులు పట్టించుకోలేదు. ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయకుండా.. ఇసుక ట్రాక్టర్లను అడ్డుకొనేందుకు మీకేం అధికారం ఉందని, మీమీదే కేసులు పెడతామంటూ టీడీపీ వారినే బెదిరించారు. ఇసుక స్మగ్లర్లకు, పోలీసులకు ఎంత సన్నిహిత సంబంధాలు ఉన్నాయో ఈ ఘటనే ఓ ఉదాహరణ.

కొంగోళ్లపల్లి విద్యార్థులకు దారిలేకుండా..

గంగవరం మండలం కొంగోళ్లపల్లి గ్రామానికి చెందిన విద్యార్థులు గతంలో కౌండిన్య నది దాటుకొని కేవలం కిలోమీటరు దూరంలోని కేటిల్‌ఫారం ఉన్నత పాఠశాలకు వెళ్లేవారు. నదిలో ఇసుక తోడేయడంతో భారీ గుంతలు ఏర్పడ్డాయి. వీటిని దాటేందుకు వీల్లేని పరిస్థితి. దీంతో తమ గ్రామానికి చెందిన విద్యార్థులు కనీసం మూడు కిలోమీటర్లు నడిచి పాఠశాలకు వెళ్లే దుస్థితి నెలకొందని ఆ గ్రామస్తులు ఆవేదన వ్యక్తంచేశారు.

అన్న క్యాంటీన్ పునఃప్రారంభానికి చర్యలు తీసుకోండి

● అధికారులకు కలెక్టర్ ఆదేశాలు.. కుప్పం అభివృద్ధిపై సమీక్ష



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్

కుప్పం, జూన్ 18: కుప్పంలో మూతపడ్డ అన్న క్యాంటీన్ పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఎస్.షన్మోహన్ ఆదేశించారు. ఆర్‌అండ్‌బీ అతిథి భవనాన్ని పూర్తిగా ఆధునికీకరించాలన్నారు. కుప్పంలో మంగళవారం కలెక్టరు పర్యటించారు. ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్‌లో చంద్రబాబు వచ్చినపుడు బస చేసే సూట్, ఇతర వీఐపీ గదులను పరిశీలించారు. అతిథి గృహాన్ని ఆధునికీకరించడంతో పాటు సరికొత్త ఫర్నిచర్ తెప్పించాలన్నారు. పాత తహసీల్దారు కార్యాలయ ఆవరణలోని అన్న క్యాంటీన్ భవనాన్ని పరిశీలించారు. త్వరలోనే పునఃప్రారంభించడానికి అవసరమైన పనులు ప్రారంభించాలన్నారు. వివిధ విభాగాలకు చెందిన అధికారులతో కలెక్టర్ సమావేశమయ్యారు. కుప్పం అభివృద్ధిపై సమీక్షించారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్‌అండ్ ఎస్ఈ ఉమామహేశ్వర్ రెడ్డి, ఆర్డీవో శ్రీనివాసులు, ఆర్‌అండ్‌బీ ఈఈ స్వామి జోస్, రెస్కో ఎండీ ప్రభాకర్, డీఎస్పీ శ్రీనాథ్, మున్సిపల్ కమిషనర్ నాగేశ్వరరావు, తహసీల్దారు హరికుమార్ తదితరులు పాల్గొన్నారు.

గజదాడుల నిరోధానికి పటిష్ఠ చర్యలు : సీసీఎఫ్



కన్నానాయక్ కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న సీసీఎఫ్ నాగేశ్వరరావు

రామకుప్పం, జూన్ 18: కౌండిన్య అభయారణ్యం పరిధిలో పంటలు, జనావాసాలపై ఏనుగుల దాడుల నిరోధానికి పటిష్ఠ చర్యలు చేపడతామని అనంతపురం అటవీ రేంజ్ చీఫ్ కన్జర్వేటర్ నాగేశ్వరరావు తెలిపారు. మంగళవారం ఆయన జిల్లా అటవీ అధికారి చైతన్య కుమార్‌తో కలిసి రామకుప్పం మండలం పీఎంకేతాండాలో పర్యటించారు. ఇటీవల ఒంటరి ఏనుగు దాడిలో మృతి చెందిన కన్నానాయక్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఇప్పటికే మృతుడి కుటుంబానికి ప్రభుత్వం రూ.5లక్షల ఆర్థికసాయం అందించినట్లు గుర్తుచేశారు. ఐదేళ్లుగా నిర్వహణ లోపం కారణంగా కందకాలు పూడిపోయాయని, సోలార్ విద్యుత్ కంచె ధ్వంసమైందన్నారు. దీంతో ఏనుగులు యథేచ్ఛగా జనావాసాల్లోకి వస్తున్నాయన్నారు. ఏనుగు దాడిలో కన్నానాయక్ మృతి చెందడం పట్ల సీఎం చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారన్నారు. అడవి నుంచి ఏనుగులు బయటకు రాకుండా చర్యలు తీసుకోవాలని తమను ఆదేశించారన్నారు. కందకాల్లో పూడిక తీయడానికి, సోలార్ విద్యుత్ కంచె పునరుద్ధరణకు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నామన్నారు. ఏనుగుల సంచారాన్ని పసిగట్టే ట్రాకర్ల సంఖ్యను పెంచాలని టీడీపీ నేతలు ఆనందరెడ్డి, విశ్వనాథ్, గంట్లప్పగౌడు, కృష్ణానాయక్ కోరారు. ఈ కార్యక్రమంలో కుప్పం అటవీ క్షేత్రాధికారి జయశంకర్, ఉపక్షేత్రాధికారి పుల్లయ్య, విభాగాధికారి బాబుప్రసాద్ తదితరులున్నారు.

గంజాయి బ్యాచ్‌లపై కేసులు

మరికొందరికి కౌన్సెలింగ్

తిరుపతి(నేరవిభాగం), జూన్ 18: గంజాయి, బహిరంగంగా మద్యం తాగుతున్న వారిపై పోలీసు శాఖ ఉక్కుపాదం మోపుతోంది. రెండ్రోజుల వ్యవధిలోనే దాదాపు 250 మంది గంజాయి, బహిరంగంగా మందు తాగే బ్యాచ్‌లను అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేశారు. ఈస్ట్ పోలీసుస్టేషన్‌లో మంగళవారం రిసెప్షన్ కౌంటర్లు, లాకప్ గదులు గంజాయి, బహిరంగంగా మద్యం తాగిన వారితో నిండిపోయాయి. వీరందరికీ పోలీసులు కౌన్సెలింగ్ ఇస్తున్నారు. మళ్లీ రోడ్లపై మందు తాగుతూ కనిపించినా, గంజాయి విక్రయాలు చేసినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

కొత్తయిండ్లు మున్సిపల్ పాఠశాలకు
పోటెత్తిన విద్యార్థులు




విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న హెచ్‌ఎం సుబ్రహ్మణ్యం

పుంగనూరు రూరల్, జూన్ 18: పుంగనూరులోని కొత్తయిండ్లు మున్సిపల్ పాఠశాలలో తమ పిల్లలను చేర్పేందుకు తల్లిదండ్రులు క్యూ కడుతున్నారు. పాఠశాలలో 750మంది విద్యార్థులకు చదువుకోవడానికి మౌళిక వసతులు ఉన్నప్పటికీ ఇప్పటికే దాదాపు 1000మందికిపై విద్యార్థులు ఉన్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు. 6వ తరగతిలోనే ఇప్పటికి 150 మంది చేరినట్లు హెచ్‌ఎం సుబ్రహ్మణ్యం చెప్పారు. పాఠశాలలో పిల్లలను చేర్పేందుకు ప్రజాప్రతినిధుల సిఫార్సులు పెరగడంతో ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారు. విద్యార్థులకు విద్యాబోధన చేయాలంటే దాదాపు 44మంది ఉండాలి. కానీ 23మంది ఉపాధ్యాయులే ఉన్నారు. ఉన్నతాధికారులు పాఠశాలకు ఉపాధ్యాయులను నియమించి ఉన్నత ఫలితాలు సాధించేందుకు తోడ్పాటు అందించాల్సిన అవసరముంది.

కిలో టమోటా రూ.60

పుంగనూరు, జూన్ 18: పుంగనూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం కిలో టమోటా ధర రూ.60 పలికింది. సోమవారం రూ.56.70కి పలకగా మంగళవారం రూ. 60పెరిగింది. రెండో రకం కిలో రూ. 55.40, మూడవ రకం కిలో రూ. 50 చొప్పున రైతుల నుంచి వ్యాపారస్తులు కొనుగోలు చేసి డిమాండ్ ఉన్న ప్రాంతాలకు పుంగనూరు మార్కెట్‌కు వచ్చిన 333.84 మెట్రిక్ టన్నులు తరలించారు.

తియాలిటీ హాట్ స్పాట్ సిటీగా తిరుపతి



దేశవ్యాప్తంగా 17 ప్రతిపాదిత నగరాలు

దక్షిణాదిన 4 నగరాల్లో తిరుపతికి చోటు

తిరుపతి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రాలుగా విలసిల్లుతున్న 17 నగరాలు రానున్న కాలంలో రియల్ ఎస్టేట్ రంగంలో శరవేగంగా అభివృద్ధి చెందడానికి అవకాశముందని కొలియర్స్ ఇండియా సంస్థ ప్రకటించిన జాబితాలో తిరుపతికి చోటు దక్కింది. రియల్ ఎస్టేట్ రంగంలో విశేష పేరు ప్రఖ్యాతులున్న ఈ సంస్థ దేశవ్యాప్తంగా అధ్యయనం నిర్వహించి రూపొందించిన నివేదికను తాజాగా విడుదల చేసింది. దీనికోసం దేశం మొత్తం మీద రియల్ ఎస్టేట్‌పరంగా అత్యధిక గ్రోత్ రేట్ వున్న వందకు పైగా నగరాలలో అధ్యయనం కొనసాగించింది. వాటిలో ముందు వరుసలో నిలిచిన 30 నగరాలను ఎంపిక చేయగా అందులో ఆధ్యాత్మిక పర్యాటక రంగం కేటగిరీ కింద 17 నగరాలను గుర్తించింది. ఈ 17 నగరాల్లో అయోధ్య, వారణాసి, పూరి, ద్వారక, షిర్డీ, అమృత్‌సర్ తదితరాలతో పాటు తిరుపతి కూడా వుండడం గమనార్హం. ఇక్కడ ఆధ్యాత్మిక పర్యాటకం, మౌలిక సదుపాయాల కల్పన ప్రాజెక్టులు వంటివి అభివృద్ధి చెందడానికి అవకాశముందని కొలియర్స్ సంస్థ అభిప్రాయపడింది. వీటి మూలంగా రియల్ ఎస్టేట్ రంగం సైతం గరిష్టంగా అభివృద్ధి చెందడానికి వీలు కలుగుతుందని అంచనా వేసింది. రియల్ ఎస్టేట్ హాట్ స్పాట్ సిటీస్‌గా ఒకటిగా సంబంధిత సంస్థ గుర్తించిన తిరుపతి దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన 17 నగరాల్లో ఒకటి కాగా అదే దక్షిణ భారతదేశం నుంచీ ఎంపికైన నాలుగు నగరాల్లో ఒకటి కావడం విశేషం. దక్షిణాదిన కోయంబత్తూరు, కొచ్చిన్, తిరుపతి, విశాఖపట్టణం ఎంపికయ్యాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం, రోడ్డు కనెక్టివిటీని పెంచడం, నూతన విమానాశ్రయాలను ఏర్పాటు చేయడం, ప్రత్యేక రైలు సర్వీసులు నడపడం వంటి చర్యలు తీసుకుంటే దీర్ఘకాలికంగా అటు ఆతిధ్య రంగంలోనూ, ఇటు రియల్ ఎస్టేట్ రంగంలోనూ అనూహ్య అభివృద్ధి సాధ్యమవుతుందని కొలియర్స్ ఇండియా సంస్థ భావిస్తోంది.

ఇప్పటికే ఊపందుకున్న నగర విస్తరణ

ఇప్పటికే తిరుపతి నగరం అర్బన్ మండల పరిధిని దాటి రూరల్ మండలం, చంద్రగిరి, రేణిగుంట, వడమాలపేట, రామచంద్రాపురం, ఏర్పేడు మండలాల్లోకి విస్తరించిన సంగతి తెలిసిందే. తిరుపతి కేంద్రంగా పరిసరాల్లోని ఈ మండలాల్లోకి నగరం వేగంగా విస్తరిస్తుండడంతో ఆయా ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ వెంచర్లు ఊపందుకుంటున్నాయి. తిరుపతి నుంచీ కడప, నెల్లూరు, చెన్నై, చిత్తూరు, మదనపల్లె వెళ్ళే మార్గాలు జాతీయ రహదారులు కావడం రియల్ ఎస్టేట్ రంగం అభివృద్ధి చెందడానికి ఊతమిస్తోంది. తిరుపతి ప్రముఖ పుణ్యక్షేత్రం కావడంతో పాటు చుట్టుపక్కల అనేక చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యత కలిగిన ఆలయాలు వుండడంతో పలువురు ఉన్నత స్థాయి వ్యక్తులు సైతం విశ్రాంత జీవితాన్ని తిరుపతి, తిరుపతి పరిసరాల్లో గడిపేందుకు ప్రాముఖ్యత ఇస్తున్నారు. దీనివల్ల ఇక్కడ స్థలాలు కొనుగోలు చేసి నివాసాలు ఏర్పరుచుకోవడం, అపార్టుమెంట్లలో ఫ్లాట్లు కొనుగోలు చేయడం క్రమేపీ పెరుగుతోంది. దీనివల్ల అపార్టుమెంట్ల సంఖ్య కూడా ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోతోంది. తాజాగా కొలియర్స్ ఇండియా సంస్థ వేసిన అంచనాల ప్రకారం చూస్తే రానున్న కాలంలో నగర విస్తరణ మరో స్థాయిని అందుకోవడం ఖాయమనిపిస్తోంది.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
తిరుపతి - 9160195583, 9703618708 9703618705, 9703618710 9985411629, 9985410347, 9985411003
చిత్తూరు - 9985411584, 9985403122
మదనపల్లి - 9985417476, 9848161191
కుప్పం - 9985403032 పలమనేరు - 9985403032
పుంగనూరు - 9985403204, పీలేరు - 9985403045
పుత్తూరు - 9985411598, శ్రీకాళహస్తి - 9985411596

CHANGE OF NAME
I, KURELLA NIRMALA, W/o K.P. VENKATESWARULU, R/o D. No. 4-106, Bazzar Street, Puttur-517583, Puttur Post & Mandal, Tirupathi District, A.P., have changed my name to KURELLA BABU NIRMALA.
AJT - 4013

CHANGE OF NAME
Vullipayala Dharma Murthy S/o Vullipayala Veerappa, Vullipayala Uma Sundari W/o Vullipayala Dharma Murthy, D. No: 23-1-40/13 A Sri Durga Nagar, Beside ESI Hospital Tirupati, Tirupati Dt. A.P., India. Here by declare that our son name previously VULLIPAYALA DHARMAMURTHY BHAGIERADAA YAADAV was changed as VULLIPAYALA DHARMA BHAGIERADAA YAADAV.
AJT - 4012

PLOTS FOR SALE
నేషనల్ హైవే కి ఆనుకొని ఏర్పేడు, వెంకటగిరి, IISEER ప్రక్కన అన్ని సదుపాయాలతో ఫైనల్ అప్రూవ్డ్ ప్లాట్లు అతితక్కువ ధరకే. డైరెక్ట్ ఓనర్. 95027 74175 / 79959 92114.
AJT - 4010

WANTED TEACHERS
Wanted teachers for higher class Social, Hindi, Computers, Wardens, PET, S.N Puram, Tirupati. Contact : 92908 98331, 70138 81383.
AJT - 4004

PLOTS FOR SALE
తిరుపతి 3K.Mలో Taj Star హోటల్, PLR Gardens దాటగానే సుబ్రహ్మణ్య స్వామి టెంపుల్, విల్లాలు ఇండిపెండెంట్ ఇల్లు, అపార్ట్‌మెంట్లు ఇల్లు, అపార్ట్‌మెంట్లు రాకముందే తిరుపతి Smart cityలో అంతర్భాగంగా అభివృద్ధి చెందుతున్న తనపల్లిలో 40 feets రోడ్డుకు ఆనుకుని వెంటనే ఇల్లు కట్టుకునే 100% వాస్తు Plots అమ్మబడును. కావలసినవారు వెంటనే సంప్రదించండి. 7386143336
AJT - 4011

WANTED
Accounts Manager (Tally), Sales Manager, Sri Gopi Krishna Oil Traders, Beri Street, Tirupati. Cont. : 93939 22999, 97049 56789
AJT - 187362

AYURVEDA
★ ధనమంత్రి ఆయుర్వేద పరిహారం మీ లైంగిక సమస్యలకి మా మాతన చికిత్స నుండి మీ ఇంద్రియమును ఏదు మండి ఏనిమిది ఇంచులు పొడవు అలాగే 3-4 ఇంచుల లావు చక్కగా దృఢంగా చేసుకోండి. లైంగిక సామర్థ్యాన్ని 30 మండి 40 నిమిషాల వరకు పెంచుకోండి. త్వరమే కాల్ చేయండి. 7411665060 AJH-002397

బంగారం కొనబడును
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్రదించు 7382114647
AJA- 189260

పాఠకులకు ముఖ్యగమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

టమోటా పంటలో దొంగలు పడ్డారు

● రాత్రిపూట కాయలను కోసుకెళ్లిన వైనం..



కాయలు కోసుకెళ్లిన చెట్లను చూపుతున్న రైతు

బి.కొత్తకోట, జూన్18: కాదేదీ దొంగతనానికి అనర్హం అన్నట్టు చివరికి టమోటా పంటలో సైతం దొంగలు పడి కాయలను కోసుకెళ్లిన సంఘటన బి.కొత్తకోట మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని గట్టు పంచాయతీ గుట్టపాళ్యం కు చెందిన నీరుగట్టి రమణారెడ్డి, జి సిద్దారెడ్డిలు చెరో రెండు ఎకరాలలో టమోటా సాగుచేశారు. పంట బాగా పండి కోతలు పడుతున్నాయి.. ధర కూడా ఆశాజనకంగా ఉండటంతో ప్రతిరోజు కంటికి రెప్పలా పంటను కాపాడుకుంటున్నారు. సోమవారం రాత్రంతా చిరుజల్లులు పడ్డాయి. దీంతో రైతులు తోటవద్దకు పోలేదు. ఇదే అదనుగా భావించి గుర్తు తెలియని వ్యక్తులు తోటలోనికి చొరబడి సుమారు రూ.లక్ష విలువ చేసే 70-80 బాక్సుల టమోటాలు కోసుకెళ్లారు. మంగళవారం ఉదయాన్నే కాయలకోతకు కూలీలతో వెళ్లి చూడగా తోటలో ఓ వైపు పూర్తిగా కాయలను కోసుకెళ్లినట్లు గుర్తించినట్టు బాధిత రైతులు తెలిపారు. ఆరుగాలం కష్టపడి, రూ.లక్షలు వెచ్చించి సాగుచేసిన పంటను రాత్రిళ్లు కూడా కాపలా కాయాల్సి వస్తోందని వారు వాపోయారు.

రేషన్‌బియ్యం స్వాధీనం..కేసు నమోదు

బి.కొత్తకోట, జూన్18: బి.కొత్తకోట పట్టణంలో అక్రమంగా అమ్మకానికి ఉంచిన రేషన్‌బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సూర్యనారాయణ తెలిపారు. సమాచారం మేరకు పౌరసరఫరాల శాఖ డిప్యూటీ తహశీల్దార్ వెంకటరెడ్డితో కలిసి మంగళవారం ఆదినారాయణ అనే వ్యక్తి దుకాణంలో తనిఖీలు చేయగా 5 బస్తాల బియ్యం దొరికాయి. పేదలకు ఇవ్వాల్సిన రేషన్ బియ్యం షాపులో అక్రమంగా ఉంచుకున్నందున నిందితుడు ఆదినారాయణ పై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

వేలం ద్వారా ప్రభుత్వానికి రూ.4.28లక్షలు ఆదాయం

ములకలచెరువు, జూన్ 18: స్థానిక ఎస్‌ఈబీ స్టేషన్‌లో మంగళవారం జరిగిన వాహనాల వేలం ద్వారా ప్రభుత్వానికి రూ.4.28 లక్షలు ఆదాయం వచ్చింది. జిల్లా ఎస్‌ఈబీ ఈఎస్ శ్రీనివాసులు అధ్యక్షతన పట్టుబడ్డ 21 వాహనాలకు వేలం నిర్వహించారు. ఈ వేలం పాటల ద్వారా జీఎస్టీతో కలిపి రూ.4,28 లక్షలు ఆదాయం వచ్చింది. ఈ వేలం పాటల్లో సీఐ రామ్మోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు ప్రత్యేక విద్యుత్ లోక్‌ఆదాలత్

మదనపల్లె, జూన్ 18: విద్యుత్ వినియోగదారుల సమస్య ల పరిష్కారానికి ఈనెల 20వ తేదీన ప్రత్యేక విద్యుత్ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఆశాఖ ఈఈ యుగంధర్ పేర్కొన్నారు. స్థానిక సీటీఎంరోడ్డులోని డివిజన్ కార్యాలయంలో గురువారం ఉదయం 11:30గంటల నుంచి మధ్యాహ్నం 1:30గంటల వరకు జరిగే ఈ సదవకాశాన్ని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఈఈ కోరారు.

వేరుశనగ రైతులకు జిప్సం అందజేయాలి

పీలేరు, జూన్ 18: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ విత్తనాలు వేసుకుంటున్న రైతులకు జిప్సం అందజేయాలని ప్రకృతి వ్యవసాయ నిపుణుడు బోడేషావలి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గత కొన్నేళ్లుగా రైతులకు ప్రభుత్వం జిప్సం అందించడం లేదని, దాని కారణంగా వేరుశగన దిగుబడి గణనీయంగా తగ్గిపోయిందని, వచ్చిన అరకొరా దిగుబడిలోనూ నాణ్యత తగ్గిపోయిందని వాపోయారు. ఈ ఏడాదైనా జిప్సంను సబ్సిడీపై అందించి రైతులను ఆదుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

వాల్మీకిపురం దర్గాను సందర్శించిన కర్ణాటక కమిషనర్ ఖాజామొహిద్దీన్



వాల్మీకిపురం, జూన్ 18: వాల్మీకిపురం పట్టణంలోని హసన్‌ఖాన్ వీధిలోని ఖ్వాజామస్తాన్ వల్లి దర్గాను మంగళవారం కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వ పొల్యూషన్ కంట్రోల్ కమిషనర్, సీఎం స్పెషల్ సెక్రటరీ ఖాజామొహిద్దీన్ సందర్శించారు. ఈసందర్భంగా దర్గానందు చాదర్ సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈకార్యక్రమంలో దర్గా కమిటీ అధ్యక్షులు సందానిబాషా, సెక్రటరీ తాహీర్, విశ్రాంత హెచ్‌ఎం కరీంసాహెబ్, సభ్యులు ఖాజాపీర్, తదితరులు పాల్గొన్నారు.

రేపు వారపు సంత, దినసరి మార్కెట్‌కు వేలం

ములకలచెరువు, జూన్ 18: ములకలచెరువు గ్రామ పంచాయతీకి సంబంధించిన వారపు సంత, దినసరి మార్కెట్‌లో రుసుం వసూలుకు గురువారం వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి ఇబ్రహీం తెలిపారు. స్థానిక గ్రామ సచివాలయంలో జరిగే వేలం పాటల్లో పాల్గొనే వారు డిపాజిట్ సొమ్మును చెల్లించి వేలం పాటల్లో పాల్గొనాలని సూచించారు.

ఈ నెల 21న బ్రహ్మాండమైన విడుదల



నంద్యాల	-	ఎఆర్ మినీ
కడప	-	రవి గ్రూప్
అనంతపురం	-	గౌతమి
రాజంపేట	-	ఎస్‌ఎస్‌ఆర్
రాయచోటి	-	సాయి థియేటర్

CONTACT: 9550740661

కూలిన స్తంభాలు.. తప్పిన ప్రమాదం

●వర్షం ధాటికి వాల్మీకిపురంలో కూలిన రెండు విద్యుత్ స్తంభాలు ●అంధకారంలో పట్టణం ● పునరుద్ధరించిన అధికారులు

వాల్మీకిపురం, జూన్ 18: వాల్మీకిపురం పట్టణంలో సోమవారం రాత్రి కురిసిన వర్షానికి విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఉన్నట్టుండి అర్ధరాత్రి ఏకధాటి వర్షానికి స్థానిక ఎన్‌టీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో రెండు భారీ విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. విద్యుత్ వైర్లు సైతం నేలపై చెల్లాచెదురుగా పడడం ఆ సమయానికి ఆ ప్రాంత సమీపంలో ఎక్కడా జన సంచారం లేకపోవడంతో పెను ప్రమాదమే తప్పింది. అప్పటికే విద్యుత్ స్తంభాల ప్రమాదాన్ని పసిగట్టిన ట్రాన్స్‌కో సిబ్బంది విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. దీంతో ఎక్కడా ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోలేదు. రాత్రి 11.30గంటల నుంచి ఉదయం 8గంటల దాకా పట్టణంలోని పలు ప్రాంతాలకు కరెంట్ లేక జనం తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. విషయం తెలుసుకున్న స్థానిక ఏఈ జాకీర్ హుస్సేన్, లైన్‌మెన్‌లు శేషాద్రిరెడ్డి, రవిలు సంఘటనా స్థలానికి చేరుకుని పునరుద్ధరణ చర్యలు చేపట్టారు. డిగ్రీ కళాశాల సమీపంలో నేలకొరిగిన విద్యుత్ స్తంభాలను ట్రాన్స్‌కో సిబ్బంది దాము, మీర్జావలి, ఇమ్రాన్, జబీ తదితరులు ఎంతో తిరిగి పునరుద్ధరించే విషయంలో చీకట్లో సైతం శ్రమపడి సమస్యను పరిష్కరించారు. ఎట్టకేలకు మంగళవారం ఉదయం 8గంటల తరువాత పట్టణం మొత్తం విద్యుత్ సరఫరా జరిగింది. దీంతో సమస్య పరిష్కారం కావడంతో పట్టణ ప్రజలతో పాటు విద్యుత్ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.



వాల్మీకిపురం పట్టణంలో వర్షం ధాటికి కూలిన విద్యుత్ స్తంభం

విధుల్లోకి తీసుకోవాలంటూ మాజీ వలంటీర్ల వినతి



మాట్లాడుతున్న రాజీనామా చేసిన వలంటీర్లు

పీలేరు, జూన్ 18: తమను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఎన్నికల సమయంలో రాజీనామాలు చేసిన పలువురు వలంటీర్లు పీలేరు ఎంపీడీవోకు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఎన్నికల సమయంలో వైసీపీ నాయకులు తమతో బలవంతంగా రాజీమానాలు చేయించారని, రాజీనామా చేయడానికి ఒప్పుకోని పలువురు వలంటీర్ల సీఎఫ్‌ఎంఎస్ ఐడీలు తెలుసుకుని వారికి తెలియకుండానే వైసీపీ నాయకులు రాజీనామా లేఖలు అందజేసేశారని వారు వాపోయారు. మరికొంత మందిని అప్పటి నేతలు బెదిరించారని వారు తెలిపారు. చాలీచాలని జీతమే అయినప్పటికీ తాము చిత్తశుద్ధితో వలంటీరు ఉద్యోగం చేశామని, చాలా మందికి వయసు మీరిపోవడంతో ఇతర ఉద్యోగాలు వచ్చే పరిస్థితి లేదన్నారు. తమకు తిరిగి తమ ఉద్యోగాలు ఇప్పిస్తే తమ కుటుంబాలను నిలబెట్టినట్లు అవుతుందని వారు అభ్యర్థించారు. ఈ మేరకు పీలేరు ఎంపీడీవో ఉపేంద్ర కుమార్ రెడ్డికి వారు వినతి పత్రం అందజేశారు. వలంటీర్లు అందజేసిన వినతి పత్రాన్ని ప్రభుత్వానికి పంపుతామని ఆయన తెలిపారు.

వయోవృద్ధులకు బీసీజీ టీకాలు తప్పనిసరి



టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

తంబళ్లపల్లె, జూన్ 18: వయోవృద్ధులు బీసీజీ టీకాలు తప్పని సరిగా వేసుకోవాలని కోసువారిపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి మునికుమార్ సూచించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు క్షయవ్యాధి నిర్మూలనే లక్ష్యంగా మంగళవారం ప్రత్యేక బీసీజీ టీకా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మా ట్లాడుతూ...వయోజనుల బీసీజీ టీకా సురక్షితమని, ఎటువంటి అపోహలు, అనుమానాలు అవసరం లేదని అర్హులైన ప్రతి ఒక్కరూ తప్పకుండా టీకా వేయించుకుని క్షయ వ్యాధి నుంచి విము క్తి పొందాలన్నారు. టీకాలను ప్రతి గురువారం, మంగళవారం మండ లంలోని అన్ని ఆరోగ్య ఉపకేంద్రాల్లో ఉచితంగా వేస్తారన్నారు. మంగ ళవారం 522 మందికి టీకాలు వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో హెల్త్‌అసిస్టెంట్ క్రిష్టానాయక్, ఏఎన్‌ఎంలు, ఆశా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గుర్రంకొండలో: బీసీజీ టీకాతో క్షయ వ్యాధిని నిర్మూలించ వచ్చని హెల్త్ ఎడ్యుకేటర్ మహ్మద్‌రఫీ పేర్కొన్నారు. మంగళవారం గుర్రంకొండ, కొత్తపేట గ్రామాల్లో బీసీజీ టీకాపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి వ్యక్తి బీసీజీ టీకాను వేయించుకోవాలన్నారు. క్షయవ్యాధిని తగిన జాగ్రత్తలు పాటించడం ద్వారా నయం చేసుకోవడం జరుగుతుందన్నారు. అనంతరం ప్రజల చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అనాథ బాలికల ఆదరణ కోసం మూడు బాల సదనాలు

కలికిరి, జూన్ 18: జిల్లాలోని అనాథ బాలికలను ఆదుకోవడానికి మూడు బాల సదనాలు సిద్దంగా ఉన్నాయని జిల్లా స్త్రీ శిశు సంక్షేమ సాధికారత శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఎలాంటి ఆదరణ కరువైన బాలికలను ఆదరించి అన్ని వసతులతో విద్యాబుద్దులు నేర్పడానికి ఈ బాల సదనాలు పనిచేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని లక్కిరెడ్డిపల్లె, రాజంపేట, మదనపల్లెలో ఈ సదనాలున్నట్లు వెల్లడించారు. ఈ బాల సదనాల్లో చేర్పించిన వారికి బాలికా విద్యను ప్రోత్సహిస్తూ 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకూ విద్య, వసతి, సంపూర్ణ ఆహారం అందించడం జరుగుతుందని తెలిపారు. అనాథ బాలలు, తల్లిదండ్రుల్లో ఎవరో ఒకరు చనిపోయిన వారి పిల్లలు (సెమీ ఆర్ఫన్స్), బిక్షాటన చేస్తున్న బాలలు, బాల కార్మికులు, పేదరికం కారణంగా ఆదరణ కరువైన బాలలు.. గుర్తించిన వారు జిల్లా స్త్రీ శిశు సంక్షేమ కార్యాలయంలోని బి.రామలక్ష్మి (ప్రొటెక్షన్ ఆఫీసర్, ఇన్‌సిట్యూషనల్ కేర్), మొబైలు నంబరు 79930 75592, బి.వెంకట రవికుమార్ (ప్రొటెక్షన్ ఆఫీసర్, నాన్ ఇన్‌స్టిట్యూషనల్ కేర్) మొబైలు 86881 84008, జి. ఖైరూన్ (లీగల్ ప్రొబేషన్ ఆఫీసరు) మొబైలు 79817 27624 నంబర్లలో సంప్రదించాల్సిందిగా కోరారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌ల నుంచి కూడా వివరాలు తెలుసుకోవచ్చన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే కూటమి లక్ష్యం



కార్యక్రమంలో మాట్లాడుతున్న జనసేన ఇన్‌చార్జ్ పోతుల సాయినాథ్

పెద్దతిప్పసముద్రం జూన్ 18 : అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ, జనసేన పార్టీల నేతలు పేర్కొన్నారు. పీటీఎం మండలం దేవప్పకోట పంచాయతీ మిట్టసోంపల్లె లో మంగళవారం టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన జెండాలను తంబళ్లపల్లె జనసేన ఇన్‌చార్జ్ పోతుల సాయినాథ్ అధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా టీడీపీ సీనియర్ నాయకుడు మంత్రి గిరిధర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాయినాథ్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి పార్టీలు కలసికట్టుగా పని చేయడంతోనే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. గ్రామాలు అభివృద్ధి చెందాలంటే యువత అందరూ కలసికట్టుగా పని చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ అనితాసురేష్, ఉప సర్పంచ్ గంగులమ్మ, జనసేన పీటీఎం మండల అధ్యక్షుడు శంకర, ఉపాధ్యక్షుడు సూరి, తంబళ్లపల్లె నియోజకవర్గ ఉపాధ్యక్షుడు మురళీకృష్ణ, మస్తాన్‌రెడ్డి, తరుగు శివారెడ్డి, టీడీపీ నాయకులు శ్రీకాంత్,మంజునాథ్, మల్లిఖార్జున, గురుమూర్తి, లక్ష్మీపతి, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



ఒకచోట చేరి ముచ్చటించుకుంటున్న పూర్వ విద్యార్థులు

బి.కొత్తకోట, జూన్18: చిన్నతనంలో కలిసి చదువుకున్న విద్యార్థులు 48 ఏళ్ల తర్వాత మళ్లీ ఒకచోట కలిశారు. బి.కొత్తకోట పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1975-76లో పదో తరగతి చదివిన విద్యార్థులు మంగళవారం బి.కొత్తకోటలో కలిసి సంబరాలు చేసుకున్నారు. అలనాటి మధురస్మృతులను నెమరు వేసుకున్నారు. కుటుంబ పరిస్థితులు, యోగక్షేమాలు విచారించుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సత్కరించాలని, పాఠశాల అభివృద్ధి కోసం తమ వంతుగా , తమ బ్యాచ్ గుర్తుగా ఏదో ఒకటి చేయాలని తీర్మానించారు. ఈ బ్యాచ్‌లోని కొందరు అధికారులుగా , రాజకీయ నేతలుగా, వ్యాపారవేత్తలుగా ఉన్నందున త్వరలో మరోసారి సమావేశమై అభివృద్ధికి కార్యాచరణ రూపొందిస్తామని ప్రకటించారు. ఎంఎస్ చంద్రశేఖర్‌రెడ్డి, బషీర్, కుడుంఅనూరాధ, ఉష, వాణి, చంద్రకళ, సకలాపద్మావతి, శోభ, అరుణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మాహమ్మారమ్మ జాతర

మదనపల్లె అర్బన్, జూన్ 18: స్థానిక ఎస్బీఐ కాలనీలో మంగ ళవారం రాత్రి మహమ్మారమ్మ ను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రెండు రోజుల పాటు నిర్వహించే జాతరకు ఆలయకమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆలయం, కాల నీ అంతా విద్యుత్ దీపాలంకరణలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. ఆలయం వద్ద చలువ పందిర్లు, భక్తులు అమ్మవారిని దర్శించుకోవడానికి వీలుగా క్యూలైన్లు ఏర్పాటు చేశారు. బుధవారం పగలు జాతర సందర్భంగా మహిళలు దీలు, బోనాలు సమర్పిస్తారు. ఆల యకమిటీ సభ్యులు పర్యవేక్షించారు.


బోయకొండమ్మ తల్లి గంగ జాతర

నిమ్మనపల్లి, జూన్ 18: మండలంలోని అగ్రహారం గ్రామంలో మంగళవారం బోయకొండమ్మ గంగజాతరను గ్రామస్థులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ మహిళలు సాంప్రదాయంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి బోనాలు, గెరిగెలు మోసి మొక్కులు తీర్చుకొన్నారు. గంగజాతరలో అమ్మవారి ఆలయం ముంగిట బళ్లారిడ్రమ్స్, చెక్కభజనలు, పిల్లనగ్రోవి, పలకలు వంటివి ఏర్పాటు చేసి అలరింపజేశారు. జాతర సందర్భంగా పండుగ వాతావరణం నెలకొంది.

నడివీధి గంగమ్మ జాతర చాటింపు

మదనపల్లె అర్బన్, జూన్ 18: మదనపల్లెలో 400 ఏళ్ల చరిత్ర కలిగిన నడివీధి గంగమ్మ జాతరకు మంగళవారం చాటింపు వేశారు. ప్రతి మూడేళ్లకు ఒకసారి జాతర జరిపించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా మంగళవారం నడివీధి గంగమ్మ జాతర చాటింపుగా మేళతాళాలు, ఆసాదుల గానంలో కమ్మవీధి, బాకావానితోపు కుమ్మరులు తయారు చేసిన గంగమ్మ విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లారు. బలిజకులస్థులు అమ్మవారికి పూజా కార్యక్రమాలు నిర్వహించి గంగమ్మ జాతర చాటింపు వేశారు. కార్యక్రమంలో నాదేళ్లవిద్యాసాగర్, బోయపాటి కృష్ణమూర్తి,రాటకొండ శేఖర్, కలకడ వేణుగోపాల్, హేమంత్, రాజా, తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. నరసింహస్వామి కల్యాణం



స్వామి వారి కల్యాణం చేస్తున్న అర్చకులు

గుర్రంకొండ, జూన్ 18:గుర్రంకొండ మండలం తరిగొండలో కొలువైన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మంగళవారం స్వామి వారి కల్యాణోత్సవాన్ని వేదపండితులు వైభవంగా నిర్వహించారు. స్వామి వారి జన్మ నక్షత్రమైన స్వాతి నక్షత్రం రోజున కల్యాణం నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలను చేశారు. అనంతరం స్వామి వారిని సర్వాంగ సుందరంగా అలంకరించి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. స్వామి వారి కల్యాణాన్ని తిలకించడానికి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. కార్యక్రమంలో అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన కార్యకర్తలకు అండగా ఉంటాం

●బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివనారాయణ

మదనపల్లె అర్బన్, జూన్ 18: టీడీపీ, జనసేన కార్యకర్తలకు బీజేపీ అండగా ఉంటుందని ఆ పార్టీ రాష్ట్రప్రధాన కార్యదర్శి బిట్ర శివనారాయణ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక రాజంపేట పార్లమెంట్ సమీక్ష సమావేశం మదనపల్లె పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న శివనారాయణ మాట్లాడుతూ ఏపీలో భారతీయ జనతా పార్టీ ఓటుబ్యాంకు ఎన్డీఏ కూటమిగా పోటీ చేయడంతో విశేషంగా పెరిగిందన్నారు. రాజంపేట పార్లమెంట్ పరిధిలో 1,40,000 ఓట్లు పెరగడం మోదీ పాలన వలనే అన్నారు. దురదృష్టమైన కారణాలతో తక్కువ ఓట్లతో రాజంపేట పార్లమెంట్ సీటు కోల్పోయామన్నారు. జిల్లా పార్టీ అధ్యక్షుడుసాయిలోకేష్ మాట్లాడుతూ రాజంపేట పార్లమెంట్‌లో ప్రతి బూత్ లెవల్‌లో విశేషంగా కృషి చేసిన నాయకులకు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో రాజంపేట పార్లమెంట్ ఇంచార్జీ చంద్రమౌళి, నంద్యాల పార్లమెంట్ ఇన్‌చార్జీ పోతుగుంట రమేష్ నాయుడు, స్టేట్ కో ఆపరేటివ్ సెల్‌కన్వీనర్ గోపాల్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు ఎల్లంపల్లె ప్రశాంత్, ఆకుల కృష్ణమూర్తి కృష్ణయాదవ్, ఆనందగజపతిరాజు, మదనపల్లె పట్టణ అధ్యక్షుడు బర్నేపల్లె రవికుమార్, ఓ సూరి కిరణ్‌కుమార్, షబీర్ అహ్మద్, బాలజ్యోతి, అసెంబ్లీ కన్వీనర్లు భగవాన్, పచ్చిపాల వసంతకుమార్, బండి ఆనంద్, జర్మనీరాజు, వేణుగోపాల్, పూలనాగరాజు, తదతరులు పాల్గొన్నారు.

మదనపల్లె జిల్లా ఆవిర్భావం త్వరలోనే..

సన్మానసభలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా



ఎమ్మెల్యే షాజహాన్‌బాషాకు మెమెంటో అందజేస్తున్న పీటీఎం శివప్రసాద్ తదితరులు

మదనపల్లె, జూన్ 18: మదనపల్లె ప్రజల దశాబ్దాల కల సాకారమయ్యే సమయం ఆసన్నమైందని, జిల్లా కేంద్రం ఆవిర్భావం త్వరలోనే జరగనుందని స్థానిక ఎమ్మెల్యే ఎం.షాజహాన్ బాషా పునరుద్ఘాటించారు. మదనపల్లె జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో పట్టణంలో మంగళవారం ఆత్మీయ సన్మానం పేరిట జరిగిన అభినందన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లాకు ఉండాల్సిన అన్ని అర్హతలు మదనపల్లెకు ఉన్నాయన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు, యువ నాయకుడు నారా లోకేశ్ కూడా మదనపల్లెకు వచ్చినప్పుడు జిల్లా కేంద్రం ప్రకటన చేశారని, ఈసందర్భంగా షాజహాన్ బాషా గుర్తుచేశారు. ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం కసరత్తు మొదలు పెట్టిందని, త్వరలో మన కల సాకారం అవుతుందని స్పష్టం చేశారు.అలాగే మదనపల్లె జిల్లా కోసం పోరాడిన ఉద్యమకారులపై పెట్టిన కేసులన్నీ ఎత్తివేస్తామని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం జిల్లా సాధన సమితి అధ్యక్షుడు పీటీఎం శివప్రసాద్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ మునిరత్నం, టౌన్‌బ్యాంకు మాజీచైర్మన్ ఎస్.విద్యాసాగర్, పోతబోలు రెడ్డెప్ప, సీపీఐ కృష్ణప్ప, పోర్డు లలితమ్మ, గ్రామజ్యోతి సుబ్రద, ముత్తరాశి హరికృష్ణ, జంగాల శివరాం, రాటకొండ మధుబాబు, సుబ్రహ్మణ్యం, గుండాల రామచంద్ర, టి.ఎ.పీర్ బాషా, కోనేటి దివాకర్, గంగులప్ప, ఆనందన్, మాజీకౌన్సిలర్లు తలారి రాధ, పులి మహాలక్ష్మి, పొదల నరసింహులు, ముత్యాల మోహన్, ప్రసాద్‌కుమార్, కమృద్దీన్, వెంకటేష్ పాల్గొన్నారు.



జనసేన ఆధ్వర్యంలో సన్మానం: మదనపల్లె, నియోజకవర్గ జనసేన నేత శ్రీరామ రామాంజనేయులు ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే ఎం.షాజహాన్‌బాషాను ఘనంగా సన్మానించారు. స్థానిక సీఎస్ఐ కమ్యూనిటీ హాలులో మదనపల్లె, నిమ్మనపల్లె, రామసముంద్రంలో మండలంలోని జనసేన నేతలు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు పెద్దసంఖ్యలో హాజరై ఎమ్మెల్యేపాటు శ్రీరామ రామాంజనేయులును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జనసేన ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి దారం అనిత, ఆపార్టీ నేతలు దారం హరిప్రసాద్, శ్రీరామ హరిహరన్, కుప్పాల శంకర్, అశ్వత్, రవితేజ, కోటకొండ చంద్రశేఖర్, కొణిదల శంకర్, అశోక్, ధరణి, శ్రీనాథ్, యాసిన్, టి.శివ, గణి, శ్రీనివాస్, దిలీప్, సీటీఎం గంగాధర్, గురు, సాయి, కురవంక వెంకటేష్, వెంకటశివ, కిరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని వినతి

మదనపల్లె అర్బన్, జూన్ 18: ఉపాధ్యాయులను మున్సిపల్ పాఠశాల్లో సర్దుబాటు చేయాలని ప్యాప్టో ఉపాధ్యాయ సంఘాల నాయకులు మంగళవారం ఎమ్మెల్యే షాజహాన్ బాషాకు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ పాఠశాల్లో గత విద్యాసంవత్సరం చాలా మంది ఉపాధ్యాయులను డిప్యుటేషన్ పేరుతో సర్దుబాటు చేశారన్నారు. కాని గత ఏడాదిలో వేసిన డిప్యుటేషన్లకు ఎలాంటి విధివిధానాలు లేవని, వారికి అనుకూలం ఉన్నచోట రాజకీయ ఒత్తిళ్లతో తమ అవసరాలకు అనుగుణంగా వేయించుకున్నారని ఆరోపించారు. విద్యార్థి- ఉపాధ్యాయుల నిష్పతి ఆధారంగా క్రమపద్ధతిలో సీనియార్టీ ప్రకారం కౌన్సెలింగ్ ద్వారా పాఠశాలలను ఎంపిక చేసుకునే అవకాశం కల్పించాలని కోరారు. మున్సిపాటీలో ప్రాథమికోతన్నత పాఠశాలను ప్రాథమిక పాఠశాలగా మార్పు చేయడంతో తెలుగు పండిట్, హిందీ పండిట్, మ్యాథ్స్ అసిస్టెంట్, సోషియల్ అసిస్టెంట్ ఇలా 25 మంది మిగులు ఉపాధ్యాయలు ఉంటారని తెలిపారు. కార్యక్రమలో ప్యాప్టో నాయకులు పురం వెంకరమణ, సుధాకర్, అశోక్, మోహన్, ఖాదర్ బాషా, హరికృష్ణ పాల్గొన్నారు.

అక్రమ లేఅవుట్లను పరిశీలించి వెంటనే అడ్డుకోవాలి

మదనపల్లె అర్బన్, జూన్18: అక్రమ లేఅవుట్లను పరిశీలించి వెంటనే అడ్డుకోవాలని సచివాలయం సిబ్బందికి ఎమ్మెల్యే షాజహాన్‌బాషా సూచించారు. మంగళవారం ఓ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలోని కోళ్లబైలు, బీకేపల్లె, అమ్మచెరువుమిట్ట, కొండామరిపల్లె గ్రామాల్లో ఏర్పాటు చేసిన లేఅవుట్స్‌లో అక్రమాలు జరిగాయాని సచివాలయ సిబ్బంది క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి రికార్డుల పరిస్థితి ఏమిటో పరిశీలించాలన్నారు. అక్రమాలు జరిగి ఉంటే నోటీసులు కూడా వారికి ఇవ్వకుండా ఆ ఇళ్లను, పునాదులను వెంటనే తొలగించాలని ఆయన ఆదేశించారు. ఇందులో మీకు ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకోస్తే పరిష్కారం చేస్తామన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ ప్రమీల మాట్లాడుతూ సచివాలయం పరిధిలో సమస్యలపై ప్రజలు వస్తే వారితో మర్యాదపూర్వకంగా మాట్లాడి సమస్యలు పరిష్కరించే దిశగా పని చేయాలన్నారు. కార్యక్రమంలో మండల రెవెన్యూ అధికారులు, హౌసింగ్ అధికారులు, సచివాలయ అధికారులు పాల్గొన్నారు.

పట్టణంలో ఎమ్మెల్యే సుడిగాలి పర్యటన



సమస్యలపై ప్రజలతో మాట్లాడి తెలుసుకొంటున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె అర్బన్, జూన్18: పట్టణంలో ఎమ్మెల్యే షాజహాన్ బాషా సమస్యలపై మంగళవారం సుడిగాలి పర్యటన చేశారు. ఇందులో భాగంగా పీఅండ్‌టీ కాలనీ కురవంకను పరిశీలించారు. అక్కడ మురుగునీటి కాలువలు, రోడ్లు పరిశీలించారు. అక్కడ ఉన్న పార్కు ప్రజలకు ఉపయోగకరంగా ఉందా? అని ప్రశ్నించారు. పార్కును పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. వర్షానికి దెబ్బతిన్న మురుగునీటి కాలువలు రిపేర్ చేయిస్తామన్నారు. అక్కడే ఉన్న ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పటేల్ రోడ్డు చాలా రోజులుగా మురుగు కాలువలు పూడిపోయి మురుగు నిల్వలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న సమస్యలను పరిశీలించి వెంటనే మున్సిపల్ కమిషనర్‌కు సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. జగన్ కాలనీలో మూడు నెలలుగా తాగునీరురావడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమీల తోపాటు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీర్చండి


మదనపల్లె అర్బన్, జూన్ 18: స్థానిక నీరుగట్టువారిపల్లె, మాయాబజార్‌లోని మున్సిపల్ వివేకానంద హైస్కూల్‌లో విద్యార్థుల తగినంత నిష్పతిలో ఉపాధ్యాయులు లేరని ఉపాధ్యాయుల కొరత తీర్చాలని స్థానికులు ఎమ్మెల్యే షాజహాన్‌బాషాకు విన్నవించారు. ఈసందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ గత ఏడాదిలో డిప్యుటేషన్ మీద వచ్చిన ఉపాధ్యాయులు తిరిగి ముందు పని చేస్తున్న స్కూల్స్ వెళ్లారని దీంతో ఉపాధ్యాయలు కొరత ఉందని వెంటనే పరిష్కరించాలని కోరారు. దీంతో ఎమ్మెల్యే మాట్లాడుతూ వారం రోజుల్లో ఈ విషయంగా పరిశీలిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సురేంద్ర, రెడ్డిశేఖర్‌రెడ్డి, హరికృష్ణ, భాస్కర్, వెంకటరమణ, టి.కృష్ణ, ధర్మేంద్ర, శ్రీనివాసులు రెడ్డి, సుబ్బయ్య, ఎ. సుధాకర్, హరినాథ్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకిచ్చిన హామీలు నిలబెట్టుకున్న చంద్రబాబు

● టీడీపీ నేత దాసరిపల్లి జయచంద్రారెడ్డి

ములకలచెరువు, జూన్ 18: ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తొలి రోజే ప్రజలకిచ్చిన హామీలను చంద్రబాబునాయుడు నిలబెట్టుకున్నారని తంబళ్లపల్లె నియోకవర్గ టీడీపీ నేత దాసరిపల్లి జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. పార్టీ అధిష్టానం సూచనల మేరకు మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలపై తొలి సంతకాలతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాలన ప్రారంభమైందన్నారు. మెగా డీఎస్సీ, ల్యాండ్ టైటలింగ్ యాక్టు రద్దు, ఫించను రూ.4వేలకు పెంపు, నైపుణ్య గణన, అన్న క్యాంటిన్లు పునరుద్ధరణలపై ఐదు సంతకాలు చేసి ప్రజలకు ఎంతో మేలు చేశారన్నారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం పరి తపించే ఏకైక నాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడన్నారు. రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమన్నారు.

రైతులకు పీఎం కిసాన్ నిధులు విడుదల



ప్రధాని కార్యాక్రమాన్ని తిలకిస్తున్న రైతులు

నిమ్మనపల్లి, జూన్ 18: మండలంలోని రైతులకు పీఎం కిసాన్ సన్మాన్ నిధి యోజన కింద మంగళవారం 17వ విడత నిధులను ప్రధానమంత్రి మోదీ మంజూరు చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖా సహాయ సంచాలకుడు శిశంకర్, ఏవో మురళీమోహన్ స్థానిక ఆర్బీకేలలో రైతులులకు ప్రధాని కార్యక్రమాన్ని టీవీల ద్వారా తిలకించేందకు ఏర్పాటు చేశారు. ఏడీ మాట్లాడుతూ ప్రదానమంత్రి రైతుల కొరకు 17వ విడత ద్వారా మండలంలోని 6042మంది రైతలకు గాను రూ.2వేల చొప్పన రూ.1.20 కోట్లను విడుదల చేసినట్లు తెలిపారు. రైతులు పెట్టు బడి సాయం కింద ఇచ్చిన సొమ్మును పంటల సాగుకు వినియోగించాలని తెలిపారు.